epaper.samayamdaily.net APTEL/2006/18267

# సమయం

మన గొంతుకే.. మన పత్రిక
తెలుగు దినపత్రిక

epaper.samayamdaily.net APTEL/2006/18267
సమయం
మన గొంతుకే.. మన పత్రిక తెలుగు దినపత్రిక

**విలేకరులు కావలెను**

తెలుగు పత్రికా రంగంలో మరో సంచలనం. వినూత్న రీతిలో వెలువడుతూ విశేష ప్రజాదరణ పొందుతున్న సమయం న్యూస్ తెలుగు డిజిటల్ దినపత్రికకు విలేకరులు కావలెను.

ఆసక్తి అనుభవం కలిగిన వారు సంప్రదించగలరు.

జిల్లాల వారీగా స్టాఫ్ రిపోర్టర్లు, నియోజకవర్గాల వారీగా ఆర్సీ ఇంచార్జీలు, మండలాల వారీగా విలేకరులు కావలెను. సీనియర్లకు ప్రాధాన్యం కొత్తవారికి అవకాశం ఉంటుంది.

ఫోన్ నెం : 99483 13985/ 89789 60131

సంపుటి : 18 సంచిక : 246 | ఎడిటర్ : విక్రం కుమార్ | గురువారం 15 మే, 2025 | ప్రచురణ : హైదరాబాద్ | పేజీలు: 8 | వెల: రూ.5

400-600 చ. అడుగుల్లోపే

## ఇందిరమ్మ ఇళ్లు

- ఆకృతిని మార్చుకోవచ్చు.. విస్తీర్ణం మాత్రం పెంచకూడదు

**మే 14, సమయం న్యూస్, హైదరాబాద్:** రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంపై అధికార యంత్రాంగం పూర్తిస్థాయిలో దృష్టి సారించింది. మొదటి, రెండో విడత కలిపి నియోజకవర్గానికి 3,500 చొప్పున రాష్ట్రవ్యాప్తంగా గరిష్ఠంగా 4.50 లక్షల ఇళ్లు అందించాలని ప్రభుత్వం నిర్ణయించింది. మొదటి విడతలో గ్రేటర్

తరువాయి 2లో





సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా

## జస్టిస్ గవాయ్ ప్రమాణం

- రాష్ట్రపతి భవన్‌లో కార్యక్రమం
- హాజరైన ప్రధాని, కేంద్ర మంత్రులు

**మే 14, సమయం న్యూస్,** ఢిల్లీ: భారత 52వ ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ)గా జస్టిస్ భూషణ్ రామకృష్ణ గవాయ్ బుధవారం ప్రమాణం చేశారు. రాష్ట్రపతి భవన్‌లోని గణతంత్ర మండపంలో జరిగిన కార్యక్రమంలో రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము ఆయనతో హిందీలో ప్రమాణం చేయించారు. ఈ కార్యక్రమానికి ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్, లోక్‌సభ స్పీకర్ ఓంబిర్లా, ప్రధాని మోదీ కేంద్ర మంత్రులు రాజ్‌నాథ్‌సింగ్, అమిత్ షా, జె.పి.నడ్డా, అర్జున్‌రామ్ మేఘ్‌వాల్, మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ తదితరులు హాజరయ్యారు. జస్టిస్ కె.జి.బాలకృష్ణన్ తర్వాత సీజేఐ అయిన రెండో దళిత న్యాయమూర్తి జస్టిస్ గవాయ్. బౌద్ధుల నుంచి ఈ పీఠాన్ని అధిరోహించిన తొలివ్యక్తి ఆయనే. 1960 నవంబరు 24న మహారాష్ట్రలోని అమరావతిలో జన్మించిన ఆయన 1985లో న్యాయవాద వృత్తి జీవితాన్ని ప్రారంభించారు. నాగ్‌పూర్, అమరావతి నగరపాలక సంస్థలు; అమరావతి విశ్వవిద్యాలయానికి స్టాండింగ్ కౌన్సిల్‌గా సేవలందించారు. సహాయ ప్రభుత్వ న్యాయవాది, అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్, ప్రభుత్వ ప్లీడర్‌గా పనిచేశాక బొంబాయి హైకోర్టుకు

తరువాయి 2లో

రామప్ప శిల్పాలే..

## ప్రాణం పోసుకొనెనా..!

- అపురూప శిల్పాల చెంత అందమైన భామలు
- ఓరుగల్లులో ప్రపంచ సుందరి పోటీదారుల సందడి
- సంప్రదాయ వస్త్రధారణతో ఆలయాల సందర్శన


2లో

నేటి నుంచి

## సరస్వతి పుష్కరాలు

- వేకువ జామున 5.44 గంటలకు కాళేశ్వరంలో లాంఛనంగా ప్రారంభం
- సాయంత్రం పుష్కర స్నానాలు ఆచరించనున్న సీఎం దంపతులు

**మే 14, సమయం న్యూస్,** హైదరాబాద్ : జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాళేశ్వరం క్షేత్రంలోని త్రివేణి సంగమంలో గురువారం నుంచి సరస్వతి నది పుష్కరాలు ప్రారంభం కానున్నాయి. గోదావరి, ప్రాణహిత నదులతో పాటు అంతర్వాహినిగా సరస్వతి నది కలిసే ఈ త్రివేణి సంగమంలో ఈ నెల 26 వరకు

తరువాయి 2లో





అరబ్ దేశాల సంపదను చూసి

## ఆశ్చర్యపోయిన ట్రంప్

- శ్వేతసౌధం, అధ్యక్షుడి విమానాలను ఆధునికీకరించాలేమోనని వ్యాఖ్య

**మే 14, సమయం న్యూస్, దోహా:** అమెరికా అధ్యక్షుడంటే.. ప్రపంచంలోనే అత్యంత శక్తిమంతమైన నేత. ప్రపంచంలోనే అతి పెద్ద ఆర్థిక వ్యవస్థకు, బలమైన సైన్యానికి అధిపతి. అలాంటి అమెరికా అధ్యక్షుడే.. అరబ్ దేశాల

తరువాయి 2లో

ఎలా కట్టకూడదో చెప్పేదే..

## కాళేశ్వరం



- రూ.లక్ష కోట్లు ఖర్చు చేసి 50 వేల ఎకరాలకైనా నీరు ఇవ్వలేదు
- గత ప్రభుత్వ నిర్లక్ష్యంతోనే ఎస్సెల్బీసీలో ఎనిమిది మంది బలి
- నీళ్లు, నిధులు, నియామకాల భావోద్వేగాన్ని కొందరు రాజకీయాలకు వాడుకొన్నారు
- ఇంజినీర్లు, జేటీవోలకు నియామక పత్రాల పంపిణీ కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

2లో

చెడగొట్టు వానలతో

## ఆశలు చెల్లాచెదురు!



- ములుగు జిల్లాలో 1,300 బస్తాల ధాన్యం నీటిపాలు
- ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో 600కిపైగా కల్లాల్లో వడ్లకు నష్టం
- మంచిర్యాల జిల్లా సారంగపల్లిలో తడిసిన 250 క్వింటాళ్ల ధాన్యం కొనుగోళ్లలో ఆలస్యమే కారణమని రైతుల ఆరోపణ

2లో

## ముద్దచర్మ వ్యాధి నియంత్రణకు టీకా



- 'బయోలంపీ వ్యాక్సిన్'ను అభివృద్ధి చేసిన భారత్ బయోటెక్ అనుబంధ సంస్థ బయోవెట్
- 'ఆవిష్కరించిన సీఎం చంద్రబాబు
- 'ప్రపంచంలోనే తొలి దివా మార్కర్ వ్యాక్సిన్

**మే 14, సమయం న్యూస్, అమరావతి:** పాల ఉత్పత్తిని దెబ్బతీస్తూ.. పాడిపశువుల పాలిట మహమ్మారిగా తయారైన ముద్దచర్మ వ్యాధి (లంపీస్కిన్ డిసీజ్ ఎల్ఎస్‌డీ) నియంత్రణకు టీకా అందుబాటులోకి వచ్చింది. భారత్

తరువాయి 2లో

# ఎలా కట్టకూడదో చెప్పేదే.. కాళేశ్వరం

హైదరాబాద్: 'రాష్ట్రంలో నీళ్లు పారలేదు కానీ నిధులన్నీ ఒకే కుటుంబానికి పారాయి. నీళ్లు, నిధులు, నియామకాలు అనే భావోద్వేగాన్ని కొంత మంది రాజకీయాలకు వాడుకొన్నారు. కొన్ని పార్టీలు రాజకీయ లబ్ధిపొందాయి' అని సీఎం రేవంత్‌రెడ్డి ధ్వజమెత్తారు. 'జవహర్‌లాల్ నెహ్రూ హయాంలో నాటి పరిస్థితులకు అనుగుణంగా నీటిపారుదల శాఖకు ప్రాధాన్యం ఇచ్చారు. భాక్రానంగల్, శ్రీశైలం, నాగార్జునసాగర్, ఎస్సారెస్పీలకు నెహ్రూ పునాది వేశారు. ఆ ప్రాజెక్టులు వందేళ్లైనా చెక్కు చెదరలేదు. రూ.లక్ష కోట్లు ఖర్చు పెట్టి కట్టిన కాళేశ్వరం మూడేళ్లలోనే కూలింది. ఇలాంటి పరిస్థితి ప్రపంచంలో ఎక్కడా లేదు' అని అన్నారు. నీటిపారుదల శాఖలో కొత్తగా నియమితులైన 244 మంది ఏఈలకు, 199 మంది జేటీవోలకు బుధవారమిక్కడ జలసౌధలో నియామక పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడారు. కొత్తగా నీటిపారుదల శాఖలో చేరి తెలంగాణ పునర్నిర్మాణంలో భాగస్వాములు కాబోతున్నారంటూ నియామక పత్రాలు అందుకున్న వారికి అభినందనలు తెలియజేశారు. ఉస్మాన్‌సాగర్, హిమాయత్‌సాగర్, శ్రీశైలం, నాగార్జునసాగర్‌లను చూసి ప్రాజెక్టులు ఎలా నిర్మించాలో తెలుసుకోవాలని, కాళేశ్వరం చూసి ఎలా కట్టకూడదో నేర్చుకోవాలని సీఎం ఉద్బోధించారు.

*** ఆ నిధులు ఎవరి జేబుల్లోకి వెళ్లాయి?**

''రూ.రెండు లక్షల కోట్లు ఖర్చు పెట్టినా ఉమ్మడి రాష్ట్రంలో మొదలు పెట్టిన తెలంగాణ ప్రాజెక్టులు పూర్తి కాలేదు... ఎందుకని? ఆ నిధులు ఎవరి జేబుల్లోకి వెళ్లాయి? మేధావులు, ఉద్యోగులు ఈ విషయమై ఆలోచించాలి. ప్రాజెక్టులు పూర్తి చేయాలనే సంకల్పంతో మా ప్రభుత్వం పని చేస్తోంది. అందుకే నీటిపారుదల శాఖలో ఖాళీలను భర్తీ చేస్తున్నాం. ఈ 15 నెలల కాలంలో నీటిపారుదల శాఖలోనే 1,161 ఖాళీలను నింపాం.

*** కాళేశ్వరం ప్రాజెక్టు ఖర్చు రూ.1.45 లక్షల కోట్లు**

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ప్రారంభించిన కోయిల్‌సాగర్, భీమా, కల్వకుర్తి ప్రాజెక్టుల విషయంలో పాలకుల నిర్లక్ష్యంతో అన్యాయం జరిగింది. సమ్మక్కసాగర్, ప్రాణహిత ప్రాజెక్టులు ప్రారంభమయినా తెలంగాణ వచ్చాక ఏదీ పూర్తికాలేదు. అసంపూర్తిగా ఉన్న ప్రాజెక్టులను పూర్తిచేయడానికే ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి ఈ శాఖను అప్పగించాం. కాగ్ నివేదిక ప్రకారం కాళేశ్వరం ప్రాజెక్టు ఖర్చు రూ.1.45 లక్షల కోట్లు. గత ప్రభుత్వ హయాంలో రూ.1.02 లక్షల కోట్ల బిల్లులు ఇచ్చారు. నేను సీఎం అయ్యే నాటికి రూ.10 వేల కోట్ల నుంచి రూ.15 వేల కోట్ల బిల్లులు బకాయి ఉన్నాయి. కానీ 50 వేల ఎకరాల ఆయకట్టుకు కూడా సాగునీరు అందలేదు.

*** నాడు పెద్ద సారు చెప్పినట్లు బ్యారేజీలు కట్టేశారు**

పూరిగుడిసె కట్టినా పునాది తవ్వి మట్టి ఎలా ఉందో చూస్తారు. కాళేశ్వరం బ్యారేజీల్లో కనీసం మట్టి పరీక్షలు చేయలేదు. పెద్ద సారు హెలికాప్టర్‌లో తిరుగుతూ పై నుంచి అక్కడ కట్టు... ఇక్కడ కట్టు అంటే అలాగే బ్యారేజీలు కట్టేశారు. తానే ఇంజినీరును, తానే డిజైనర్‌ను అన్నట్లుగా వ్యవహరించారు. మట్టి పరీక్షలు కూడా చేయకుండా కాళేశ్వరం ప్రాజెక్టు కట్టిన ఘనత మాజీ సీఎం కేసీఆర్‌ది. ఇంజినీరింగ్ పనులను ఇంజినీర్లను చేయనీయాలి. అలా కాకుండా వారి పనిలో చొరబడితే ఏమవుతుందో తెలియడానికి కేసీఆరే నిలువెత్తు ఉదాహరణ. ప్రజాప్రతినిధులు ఎవరూ అలా చేయొద్దు.

*** అందరిపై చర్యలు తీసుకోవాలని విజిలెన్స్, ఎన్డీఎస్‌ఏలు చెప్పాయి**

ఒక ఇంజినీరు 30 ఏళ్లు పనిచేస్తే ఈఎన్సీ అవుతారు. పరిమిత జ్ఞానంతో రాజకీయ నాయకులు చెప్పింది చేస్తే ఊచలు లెక్కించాల్సి వస్తుంది. కాళేశ్వరం బ్యారేజీలపై విజిలెన్స్, ఎన్డీఎస్‌ఏలు ఇచ్చిన నివేదికల్లో అధికారులే బాధ్యులని రాశారు. మొత్తం అధికారులను ఉరి తీయమని ఆ నివేదికల్లో పేర్కొన్నారు. గత ప్రభుత్వ హయాంలో లోపభూయిష్ట నిర్మాణాలతో ప్రాజెక్టులు పూర్తి చేస్తే ఎప్పుడు ఏది కూలుతుందో తెలియని పరిస్థితి ఏర్పడింది. ప్రాజెక్టుల పిల్లర్లు పేకమేడలా కూలిపోతున్నాయి. ఇటీవల సీతారామసాగర్ పిల్లర్లు కూలాయి. ప్రాజెక్టుల నాణ్యత విషయంలో ఇంజినీర్లు ఎవరి ఒత్తిడులకు లొంగవద్దు. నిర్మాణాలకు సంబంధించి ప్రజాప్రతినిధులు ఏ సూచనలు చేసినా బాధ్యులు మాత్రం మీరే అవుతారని గ్రహించండి.

*** నిపుణుల సూచన మేరకు ముందుకు**

రాష్ట్రంలో ప్రాజెక్టుల నిర్మాణంలో మా ప్రభుత్వం నిపుణుల సూచనల మేరకు ముందుకు వెళ్తోంది. 75 శాతం పూర్తయిన ప్రాజెక్టులను తక్షణమే పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. ఉమ్మడి రాష్ట్రంలో 44 కిలోమీటర్ల పొడవుతో చేపట్టిన శ్రీశైలం ఎడమ గట్టు కాలువ సొరంగం నిర్లక్ష్యానికి గురైంది. నాడు 25 కిలోమీటర్ల తవ్వకం పూర్తయితే రాష్ట్రం ఆవిర్భవించాక పదేళ్లలో పది కిలోమీటర్లు కూడా పూర్తి కాలేదు. గత ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా పదేళ్లు పనులు కదలకుండా ఉండటంతో యంత్ర సామగ్రి మట్టిలో కూరుకుపోయి ఎనిమిది మందిని పొట్టన పెట్టుకున్నాయి. ఉమ్మడి నల్గొండ జిల్లాలో 3.60 లక్షల ఎకరాలకు గ్రావిటీ ద్వారా నీళ్లు ఇచ్చేందుకు చేపట్టిన ఎస్సెల్బీసీకి రూ.2 వేల కోట్లు ఖర్చు చేసి ఉంటే పూర్తయ్యేది. ప్రజల సెంటిమెంట్ నీళ్లు. దానిని దృష్టిలో పెట్టుకుని ప్రాజెక్టులు పూర్తి చేయాలి. రాష్ట్రంలో నిధుల కొరత ఉంది. అయినా ఏదో ఒక ప్రయత్నం చేస్తాం. మొదటి ప్రాధాన్యంగా ఉన్న ఎస్సెల్బీసీ, కల్వకుర్తి, పాలమూరురంగారెడ్డి, కోయిల్‌సాగర్, భీమా, నెట్టెంపాటు, సీతారామసాగర్, సమ్మక్కసాగర్, దేవాదుల తదితర ప్రాజెక్టులు పూర్తి చేస్తాం.

## నేటి నుంచి సరస్వతి పుష్కరాలు

(మొదటి పేజీ తరువాయి)

ఈ మహాక్రతువు జరగనుంది. బృహస్పతి (గురువు) మిథున రాశిలోకి ప్రవేశంతో సరస్వతి నదికి పుష్కరాలు వస్తున్నాయి. బుధవారం రాత్రి 10.35 గంటలకే బృహస్పతి (గురువు) మిథున రాశిలోకి ప్రవేశించి పుష్కరకాలం ప్రారంభమవుతున్నా... గురువారం సూర్యోదయం నుంచి పుష్కర స్నానాలు ఆచరించాలని కాళేశ్వరం ఆలయ అర్చకులు వివరించారు. గురువారం వేకువజామున 5.44 గంటలకు సరస్వతి ఘాట్ వద్ద శ్రీగురు మదనానంద సరస్వతి పీఠాధిపతి మాధవానంద ప్రత్యేక పూజలు నిర్వహించి పుష్కరాలను లాంఛనంగా ప్రారంభిస్తారు.

**సరస్వతి నవరత్న మాల హారతి**

ప్రతిరోజూ సరస్వతి ఘాట్‌లో సాయంత్రం 6.45 నుంచి 7.35 గంటల వరకు సరస్వతి నవరత్న మాల హారతి ఉంటుంది. దీంతోపాటు కళా, సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటుచేశారు. భక్తులు రుసుము చెల్లించి బస చేసేందుకు వీలుగా తాత్కాలికంగా టెంట్ సిటీని నిర్మించారు. పుష్కరాల నిర్వహణకు రాష్ట్ర ప్రభుత్వం రూ.35 కోట్లు కేటాయించింది. తాగునీటి సౌకర్యం, పారిశుద్ధ్య నిర్వహణ, ఘాట్ల నిర్మాణం, రహదారి మరమ్మతులు, పార్కింగ్ తదితర ఏర్పాట్లన్నీ పూర్తిచేశారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి కాళేశ్వరానికి ఆర్టీసీ ప్రత్యేక బస్సులు ఏర్పాటుచేసింది. ప్రతిరోజు సగటున లక్షన్నర మంది వస్తారని దేవాదాయశాఖ అంచనా వేసింది. పుష్కరాల నేపథ్యంలో నదీ జలాలు కలుషితం కాకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలని కాలుష్య నియంత్రణ మండలి (పీసీబీ) అధికారుల్ని అటవీ, పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేఖ ఆదేశించారు. సరస్వతి నది పుష్కరాల పోస్టర్‌ను పీసీబీ అధికారులతో కలిసి బుధవారం హైదరాబాద్‌లో మంత్రి ఆవిష్కరించారు.

## చెడగొట్టు వానలతో ఆశలు చెల్లాచెదురు!

ఏటూరునాగారం రూరల్, మందమర్రి పట్టణం: అకాల వర్షం మరోసారి అన్నదాతలకు కన్నీళ్లు మిగిల్చింది. ధాన్యం గింజలు కళ్లెదుటే వరద నీటిలో కొట్టుకుపోతుంటే వారు తల్లడిల్లారు. చెడగొట్టు వానలతో తమ ఆశలు గల్లంతయ్యాయని వాపోతున్నారు. ములుగు, కరీంనగర్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, మంచిర్యాల జిల్లాల్లో మంగళవారం అర్ధరాత్రి, బుధవారం తెల్లవారుజామున భారీ వానలు కురిశాయి. ములుగు జిల్లా ఏటూరునాగారం మండలం గోగుపల్లిలో బుధవారం వేకువజామున 4 గంటల నుంచి ఉదయం 7 గంటల వరకు కురిసిన వర్షంతో ఊరవాగుకు వరద పోటెత్తింది. దాంతో సమీపంలోని ధాన్యం కొనుగోలు కేంద్రం నీట మునిగింది. రవాణాకు సిద్ధంగా ఉన్న 600 బస్తాలతోపాటు ఆరబోసిన మరో 700 బస్తాల ధాన్యం ప్రవాహంలో కలిసిపోయింది. హమాలీలు, లారీల కొరత, కేంద్రం నిర్వాహకుల నిర్లక్ష్యంతోనే నష్టం వాటిల్లిందని రైతులు వాపోతున్నారు. యాభై మందికిపైగా అన్నదాతలకు రూ.30 లక్షల వరకు నష్టం జరిగినట్లు ప్రాథమిక సమాచారం. ఐటీడీఏ పీవో చిత్రామిశ్ర సంఘటన స్థలాన్ని పరిశీలించారు. ''మూడెకరాల్లో పండించిన పంటను 20 రోజుల కిందట కేంద్రానికి తీసుకొచ్చాం. తేమ పేరుతో ఆలస్యం చేశారు. లారీలు కూడా రావడం లేదన్నారు. చూస్తుండగానే పంటంతా నీటి పాలైంది. ఏం చేయాలో తోచడంలేదు'' అని స్థానిక రైతు బండారి సుజాత రోదించారు. ప్రభుత్వ నిర్లక్ష్యంతో రైతులకు నష్టం జరిగిందని ములుగు జడ్పీ మాజీ ఛైర్‌పర్సన్ బడే నాగజ్యోతి ఆరోపించారు. నీట మునిగిన కేంద్రాన్ని ఆమె పరిశీలించారు. తడిసిన ధాన్యాన్ని బాయిల్డ్ రైస్‌మిల్లులకు పంపించాలని కోరారు.

**కల్లాల్లో ధాన్యం కదల్లేదు**

బుధవారం తెల్లవారుజామున కురిసిన భారీ వర్షంతో కరీంనగర్ జిల్లా వీణవంక, శంకరపట్నం, జమ్మికుంట, మానకొండూర్, రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట, జగిత్యాల జిల్లా ధర్మపురి, పెద్దపల్లి జిల్లా జూలపల్లి మండలాల్లోని ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ఆరు వందలకుపైగా కల్లాల్లోని వడ్ల కుప్పలు తడిసిపోయాయి. కొన్నిచోట్ల తేమ కారణంతో కాంటా పెట్టకపోగా, ఇంకొన్నిచోట్ల హమాలీలు, బస్తాల కొరతతో సేకరణ ఆలస్యమవుతోందని రైతులు ఆరోపించారు.

## 400..600 చ. అడుగుల్లోపే ఇందిరమ్మ ఇళ్లు



హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంపై అధికార యంత్రాంగం పూర్తిస్థాయిలో దృష్టి సారించింది. మొదటి, రెండో విడత కలిపి నియోజకవర్గానికి 3,500 చొప్పున రాష్ట్రవ్యాప్తంగా గరిష్ఠంగా 4.50 లక్షల ఇళ్లు అందించాలని ప్రభుత్వం నిర్ణయించింది. మొదటి విడతలో గ్రేటర్ హైదరాబాద్‌ను మినహాయించి రాష్ట్రవ్యాప్తంగా మండలానికి ఒక్కో గ్రామం చొప్పున 562 గ్రామాల్లో 70,122 ఇళ్లు మంజూరు చేసింది. ఇందులో 47,335 మంది లబ్ధిదారులకు అనుమతులకు సంబంధించిన ప్రొసీడింగ్స్ అందించారు. ఇప్పటివరకు 17,962 మంది ఇళ్ల నిర్మాణానికి ముగ్గులు పోసుకోగా.. 6,132 మంది పునాది వరకు పూర్తి చేసుకున్నారు. ప్రధానంగా ఇంటి నిర్మాణ కొలతలపై లబ్ధిదారుల్లో పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ నేపథ్యంలో రెండో విడతలోనూ ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా తీసుకుంటున్న చర్యల వివరాలను రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ ఎండీ వి.పి. గౌతమ్ 'ఈనాడు'కు వెల్లడించారు. లబ్ధిదారులకు పలు సూచనలు చేశారు. వివరాలు ఆయన మాటల్లోనే..

**అంగీకార పత్రం ఇస్తే మరో అవకాశం..**

ఇందిరమ్మ ఇళ్లను కచ్చితంగా 400600 చదరపు అడుగుల మధ్యలోనే నిర్మించుకోవాలి. ప్రభుత్వం అందించే రూ.5 లక్షలతోనే నిర్మాణం పూర్తయ్యేలా ప్రతి మండలంలో నమూనా ఇళ్లు నిర్మించారు. లబ్ధిదారులు ఆకృతిలో తమకు నచ్చిన మార్పులు చేసుకోవచ్చు. విస్తీర్ణం మాత్రం పెంచకూడదు. గతంలో 560 చదరపు అడుగుల్లో రెండు పడకగదుల ఇళ్లు నిర్మించాం. ఇప్పుడూ 600 చదరపు అడుగుల వరకు నిర్మించుకునేందుకు లబ్ధిదారులకు అవకాశం ఇస్తున్నాం. ఇందులో ఇల్లు విశాలంగా ఉంటుంది. రెండు పడకగదులు, హాలు, కిచెన్, రెండు బాత్రూంలు వస్తాయి. మొదటి విడతలో 370 మంది లబ్ధిదారులు 600 చదరపు అడుగుల కంటే ఎక్కువ విస్తీర్ణంలో పునాది వేసుకున్నారు. వీరికి మరో అవకాశం ఇస్తున్నాం. 600 చదరపు అడుగులకు కుదించుకుని శ్లాబు వేసుకుంటే బిల్లులు మంజూరు చేస్తున్నాం. ఇలా చేస్తామని అంగీకార పత్రం ఇస్తే బిల్లులు అందిస్తాం.

**ప్రతి సోమవారం బిల్లుల సొమ్ము జమ**

పునాది పూర్తి కాగానే లబ్ధిదారులకు ప్రతి సోమవారం బిల్లులు అందిస్తున్నాం. పునాది పూర్తిచేసుకున్న వారిలో ఇప్పటివరకు 3,757 మందికి రూ.37.57 కోట్లు మంజూరు చేశాం. గ్రామ కార్యదర్శి ఏఈడీఈ పీడీ జిల్లా కలెక్టర్ హౌసింగ్ కార్పొరేషన్‌కు దశలవారీగా ఆన్‌లైన్‌లో బిల్లుల కోసం వివరాలు నమోదు చేస్తారు. హౌసింగ్ కార్పొరేషన్ లాగిన్‌కు రాగానే వెంటనే లబ్ధిదారుల ఖాతాలో సొమ్ము జమ చేస్తున్నాం.

**వేగంగా రెండో విడత ఎంపిక**

రెండో విడతలో లబ్ధిదారుల ఎంపిక వేగంగా జరుగుతోంది. మండలస్థాయిలో మొత్తం 2,75,681 మంది లబ్ధిదారుల వివరాలపై విచారణ జరిపారు. వీరిలో 2,28,137 మందిని అర్హులుగా గుర్తించారు. జిల్లాస్థాయిలో 2,20,137 మందికి అధికారులు అనుమతులు ఇచ్చారు. రెండో విడతలో ఇప్పటివరకు 57,430 మందికి వ్యక్తిగతంగా ప్రొసీడింగ్స్ ఇవ్వగా.. వారు పనులను ప్రారంభించుకుంటున్నారు. మిగిలినవారికి కూడా త్వరలోనే అనుమతి పత్రాలు అందిస్తాం. ఎల్ 1, ఎల్ 2, ఎల్ 3లో జాబితాల్లో అర్హులైన వారందరికీ ఇళ్లు మంజూరు చేస్తున్నాం. ఎల్ 3 జాబితాలోనూ అర్హులైనవారు ఉంటే వారిని ఎల్ 1 జాబితాకు మార్చి అనుమతులు ఇస్తున్నాం. జీహెచ్ఎంసీలో మాత్రం మురికివాడల్లోనే జీ+3లో ఇళ్లను కట్టించాలన్న ఆలోచనలో ప్రభుత్వం ఉంది. ఇందుకోసం స్థలాలను గుర్తించే ప్రక్రియను త్వరలోనే చేపడతాం.

**సిమెంటు, ఇనుముపై త్వరలో నిర్ణయం..**

సిమెంటు, ఇనుము ధరలు పెరిగాయని మా దృష్టికి వచ్చింది. లబ్ధిదారులపై భారం పడకుండా సిమెంటు, ఇనుము సరఫరా చేసే కంపెనీలతో సమావేశం నిర్వహించాం. లబ్ధిదారులకు తక్కువ ధరకు అందించాలని కోరాం. ఇసుకను ఉచితంగానే అందిస్తున్నాం.

## సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ గవాయ్ ప్రమాణం

(మొదటి పేజీ తరువాయి)

చెందిన నాగ్‌పుర్ ధర్మాసనంలో 2003లో అదనపు న్యాయమూర్తిగా, 2005లో అక్కడే శాశ్వత న్యాయమూర్తిగా నియమితులయ్యారు. 2019 మే 24న సుప్రీంకోర్టు న్యాయమూర్తి అయ్యారు. ఆరేళ్లలో సుమారు 700 ధర్మాసనాల్లో భాగస్వామిగా ఉన్నారు. 370 అధికరణం రద్దు, ఎన్నికల బాండ్ల రద్దు, పెద్దనోట్ల రద్దు, ఎస్సీల వర్గీకరణ వంటి అనేక సంచలనాత్మక కేసులలో తీర్పులు వెలువరించారు. సీజేఐగా ఆయన ఈ ఏడాది నవంబరు 23 వరకు కొనసాగుతారు. నూతన హోదాలో సుప్రీంకోర్టుకు రాగానే అక్కడ మహాత్మాగాంధీ, అంబేడ్కర్ విగ్రహాలకు పుష్పాలతో ఆయన నివాళులర్పించారు. తండ్రి మాజీ గవర్నర్ జస్టిస్ గవాయ్ తండ్రి దివంగత ఆర్.ఎస్.గవాయ్ అంబేడ్కర్ వాది. బిహార్, కేరళ రాష్ట్రాలకు గవర్నర్‌గా, అంతకు ముందు ఎంపీగా ఆయన సేవలందించారు. తనకు మాత్రం రాజకీయాలపై ఆసక్తి లేదని నూతన సీజేఐ చెప్పారు. పదవీ విరమణ తర్వాత ఎలాంటి బాధ్యతలు తీసుకోవాలనుకోవడం లేదని, ఇతర పదవులన్నీ కూడా సీజేఐ కంటే తక్కువేనని అభిప్రాయపడ్డారు. నూతన ప్రధాన న్యాయమూర్తికి ప్రధాని మోదీ అభినందనలు తెలిపారు. ప్రమాణం పూర్తయిన వెంటనే నూతన సీజేఐ తన తల్లి కమల్‌తాయ్ గవాయ్‌కి పాదాభివందనం చేసి ఆశీస్సులు తీసుకున్నారు. 'తండ్రి అడుగుజాడల్లో నడిచి నా పిల్లలు సమాజానికి సేవ చేయాలని కోరుకుంటున్నాను. ప్రజల్ని గౌరవించి, స్థాయితో సంబంధం లేకుండా వారికి న్యాయం చేయాలి. అనేక కష్టాలు అధిగమించి, క్లిష్ట పరిస్థితుల్ని ఎదుర్కొని నా తనయుడు ఈ స్థాయికి చేరడం ఎంతో సంతృప్తినిస్తోంది' అని కమల్‌తాయ్ చెప్పారు.

## ముద్దచర్మ వ్యాధి నియంత్రణకు టీకా

(మొదటి పేజీ తరువాయి)

బయోటెక్ అనుబంధ సంస్థ బయోవెట్ తయారు చేసిన ఈ టీకాను బుధవారం విజయవాడలో జరిగిన పశుసంవర్ధక రంగ ఏఐ టెక్ 2.0 సదస్సులో ముఖ్యమంత్రి చంద్రబాబు, వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు ఆవిష్కరించారు. లంపీస్కిన్ వ్యాధి నియంత్రణకు టీకాను ప్రపంచస్థాయి ప్రమాణాలకు అనుగుణంగా బయోవెట్ సంస్థ రూపొందించడం సంతోషంగా ఉందని చంద్రబాబు పేర్కొన్నారు. పాడి పరిశ్రమ అభివృద్ధికి ఈ టీకా ఎంతో దోహదపడుతుందని ప్రశంసించారు. భారత్ బయోటెక్ సీడీఓ డాక్టర్ రేచస్ ఎల్లను సీఎం చంద్రబాబు అభినందించారు.

**అత్యంత సురక్షిత టీకా**

బయోవెట్ ఆధ్వర్యంలో రూపొందించిన బయో లంపీ వ్యాక్సిన్ ప్రపంచంలోనే తొలి.. అత్యంత సురక్షితమైన దివా మార్కర్ వ్యాక్సిన్ అని సంస్థ ప్రతినిధులు సీఎంకు వివరించారు. లంపీ స్కిన్ నిర్ధారణ, నియంత్రణకు ఇది ఉపయోగపడుతుందని తెలిపారు. హిస్సార్‌లోని ఐసీఏఆర్ ఎన్ఆర్సీ (నేషనల్ రీసెర్చ్ సెంటర్ ఆన్ ఈక్విన్స్) అందించిన ఎల్ఎస్‌డీ వైరస్/రాంచీ/2019 వ్యాక్సిన్ స్ట్రెయిన్‌తో బయోవెట్ సంస్థ దీన్ని అభివృద్ధి చేసినట్లు వివరించారు. సెంట్రల్ డ్రగ్స్ స్టాండర్డ్ కంట్రోల్ ఆర్గనైజేషన్ (సీడీఎస్‌సీఓ) ఆమోదం లభించినట్లు పేర్కొన్నారు. టీకాల కోసం విదేశాలపై ఆధారపడకుండా మన వ్యాక్సిన్ మన దేశంలోనే అభివృద్ధి చేయాలనే బయోటెక్ ఎగ్జిక్యూటివ్ ఛైర్మన్, బయోవెట్ వ్యవస్థాపకుడు కృష్ణ ఎల్ల ఆలోచనల నుంచి టీకా రూపొందించినట్లు సంస్థ ప్రతినిధులు వివరించారు.

## రామప్ప శిల్పాలే.. ప్రాణం పోసుకొనెనా..!

వరంగల్, మహబూబాబాద్ : కాకతీయ శిల్పకళను చూస్తూ.. ఆధ్యాత్మిక ఆనందాన్ని ఆస్వాదిస్తూ.. తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలను ఆసక్తిగా గమనిస్తూ ప్రపంచ సుందరి పోటీదారులు సందడి చేశారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో వెయ్యేళ్ల చరిత్రకు సజీవ సాక్ష్యంగా ఉన్న వేయి స్తంభాల గుడి, ఖిలా వరంగల్, రామప్ప దేవాలయాలను సందర్శించారు. ఆ రాతి కట్టడాలను తాకుతూ అక్కడి విశేషాలను తెలుసుకున్నారు. హైదరాబాద్‌లో నిర్వహిస్తున్న 72వ మిస్ వరల్డ్ పోటీల్లో పాల్గొంటున్న లాటిన్ అమెరికా దేశాలకు చెందిన 22 మంది సుందరీమణులు బుధవారం వరంగల్ నగరంలో పర్యటించగా ఐరోపా ఖండంలోని 35 దేశాలకు చెందిన అందగత్తెలు ములుగు జిల్లా వెంకటాపూర్ మండలం పాలంపేటలోని రామప్ప ఆలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా 'హలో తెలంగాణ.. అందరూ బాగున్నారా' అంటూ పలకరించారు.

**సంప్రదాయ చీరకట్టులో వచ్చి.. బతుకమ్మలతో ఆడిపాడి**

హైదరాబాద్ నుంచి పర్యాటక శాఖకు చెందిన ప్రత్యేక బస్సుల్లో బుధవారం సాయంత్రం 4.42 గంటలకు హనుమకొండకు చేరుకున్న అందాలభామలకు మెడలో పూలమాల వేసి వారిపై పూలు చల్లుతూ ఘన స్వాగతం పలికారు. బతుకమ్మలు, సన్నాయి వాయిద్యాలతో ఆహ్వానించారు. సుందరీమణులు మహిళలతో కలిసి బతుకమ్మ ఆడారు. అనంతరం భారతీయ కట్టూబొట్టుతో వేయిస్తంభాల గుడిని సందర్శించారు. ఆలయ చరిత్రను అక్కడి గోడలపై ఉన్న శాసనాల ద్వారా గైడ్‌లు అతిథులకు వివరించారు. ఒక్కొక్కరూ ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఇత్తడి పళ్లెంలో కాళ్లు కడుక్కొని ఆలయంలోకి అడుగు పెట్టారు. ఆలయంలోని స్తంభాలు, శిల్పాలతో సెల్ఫీలు తీసుకున్నారు. అనంతరం రుద్రేశ్వరుడిని దర్శించుకోగా అర్చకులు వేదాశీర్వచనం అందజేశారు. అక్కడి నుంచి ఖిలా వరంగల్‌కు చేరుకున్నారు. ఉమ్మడి వరంగల్‌లో ప్రఖ్యాతి గాంచిన చపాటా మిర్చి, పసుపు, ఓరుగల్లు దరీస్, రంగశాయిపేట షీల్డ్‌ల స్టాళ్లను అధికారులు ఏర్పాటు చేశారు. అక్కడికి చేరుకున్న అందగత్తెలకు అధికారులు చపాటా మిర్చి, పసుపుకొమ్ములను ఇస్తూ స్వాగతం పలికారు. ఖిలా వరంగల్‌లో ప్రతి రాయి, శిల్పాల విశేషాలను గైడ్‌లను అడుగుతూ చరిత్ర తెలుసుకున్నారు. అనంతరం రాష్ట్రపతి అవార్డు గ్రహీత పెండ్యాల లక్ష్మిప్రియ, నటరాజ రామకృష్ణ బృందాలు చేసిన రుద్రమదేవి, పేరిణి శివతాండవం నృత్యాలు ఆహూతులను అలరించాయి. అనంతరం 'ఓరుగల్లు ఆతిథ్యం మరిచిపోలేనిది. మేం చూసిన నృత్యాలు ఇక్కడి చరిత్రను తెలియజేస్తున్నాయి. ఈ చల్లటి సాయంత్రం వేళ మీరిచ్చిన అనుభూతి మాకు ఎప్పటికీ గుర్తుంటుంది. తెలంగాణను ప్రేమిస్తున్నాం. తెలంగాణ, జరూర్ ఆనా'' అని అర్జెంటినా, పనామా, అమెరికా, కెనడాలకు చెందిన పోటీదారులు సంతోషం వ్యక్తం చేశారు. మంత్రి సురేఖ, ఎంపీ కావ్య అతిథులకు షీల్డ్‌లు, ఓరుగల్లు దరీస్‌ను బహుమతులుగా అందజేశారు.

## అరబ్ దేశాల సంపదను చూసి ఆశ్చర్యపోయిన ట్రంప్

(మొదటి పేజీ తరువాయి)

సంపదను, విలాసాన్ని చూసి ఆశ్చర్యపోయారు. నాలుగు రోజుల గల్ఫ్ దేశాల పర్యటనలో అరబ్ నేతలు ఇచ్చిన ఆతిథ్యం డొనాల్డ్ ట్రంప్‌ను సంభ్రమాశ్చర్యాలకు గురిచేసింది. ఖతారీ ప్యాలెస్‌లోని పాలరాయిని చూసి అద్భుతమని ట్రంప్ మెచ్చుకున్నారు. దానిని సొంతం చేసుకోవడం ఎంతో ఖర్చుతో కూడకున్నది కావొచ్చని వ్యాఖ్యానించారు. ఖతార్ ఎమిర్‌ను పొగడ్తలతో ముంచెత్తారు. సౌదీ అరేబియాలోని ధగధగ మెరిసే విమానాలపైనా ఆయన ప్రశంసలు కురిపించారు. వాటితో పోలిస్తే తన ఎయిర్‌ఫోర్స్ వన్ విమానం ఎంతో చిన్నదని, ఆకట్టుకునేలా లేదని అభిప్రాయపడ్డారు.

# విద్యార్థుల నమోదు పెంపుదల లక్ష్యంగా ఉపాధ్యాయులు పనిచేయాలి

*** జిల్లా కలెక్టర్ జితేష్ పాటిల్**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, మే 14 (సమయం న్యూస్): ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల నమోదును పెంచే దిశగా ఉపాధ్యాయులు కృషి చేయాలని దీనికోసం నాణ్యమైన విద్యను అందించడమే ప్రధాన లక్ష్యం అని జిల్లా కలెక్టర్ జితేష్ పాటిల్ అన్నారు. జిల్లాస్థాయిలో ఉపాధ్యాయుని ఉపాధ్యాయులకు జరుగుతున్న శిక్షణ కార్యక్రమాన్ని జిల్లా విద్యాశిక్షణ కేంద్రంలో సందర్శించిన ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులు తాము అనుకున్న లక్ష్యాలను చేరుకోవాలన్నా ప్రభుత్వ పాఠశాలలను నిలబెట్టి విద్యను అందరికీ అందే విధంగా కృషి చేయాలన్న నాణ్యమైన విద్యను అందించడమే మార్గమని దీనికి వేరే ప్రత్యామ్నాయం లేదని తెలిపారు.




నాణ్యమైన విద్యను అందించడంలో భాగంగా శిక్షణా కార్యక్రమాలు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని వచ్చే విద్యా సంవత్సరం నుండి సాంకేతిక పరిజ్ఞానాన్ని తరగతి గదిలో వినియోగించడం మౌలిక భాష గణిత అభివృద్ధి కార్యక్రమాన్ని కృత్రిమ మేధా ఆధారంగా అభివృద్ధి పరచటం పాఠశాల విద్యలో నూతనంగా ప్రవేశపెట్టబడుతున్న కృత్రిమ మేధ పాఠ్యాంశాలను పిల్లలకు అందించడం అనే మూడు నూతన విషయాలతో ఈ కార్యక్రమం రూపొందించబడిందని దీనిని ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు అందరూ అందిపుచ్చుకొని ప్రభుత్వ పాఠశాల విద్యాభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. పాఠశాలలలో మౌలిక వసతుల కల్పనకు తాము ఎప్పుడూ సిద్ధంగా ఉంటామని మౌలిక వసతులలో ఏ విధమైన అంతరాలు ఉన్న జిల్లా విద్యాశాఖ అధికారికి తెలియజేస్తే సాధ్య మైనంత వరకు ఏర్పాటు చేయటానికి తప్పనిసరిగా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. పిల్లలకు నాణ్యమైన విద్యను అందించడంలో ఉపాధ్యాయులకు ఎవరూ ప్రత్యామ్నాయం కాదని ఉపాధ్యాయ సర్వశక్తిమంతులని కావున వారంతా ప్రభుత్వ విద్య పరిరక్షణకు తప్పనిసరిగా కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి వెంకటేశ్వరచారి, జిల్లా అకాడమిక్ మానిటరింగ్ అధికారి నాగరాజశేఖర్, జిల్లా ప్లానింగ్ కోఆర్డినేటర్ ఎన్.సతీష్ కుమార్, జిల్లా రిసోర్స్ పర్సన్లు, ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



## బడితెరిచే నాటికి పాఠ్యపుస్తకాలు పూర్తిస్థాయిలో అందిస్తాం

*** జిల్లా కలెక్టర్ జితేష్ పాటిల్**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, మే 14 (సమయం న్యూస్): పాఠశాల పునః ప్రారంభానికి ముందే పాఠ్యపుస్తకాలను పూర్తిస్థాయిలో పాఠశాలలకు అందించనున్నామని జిల్లా కలెక్టర్ జితేష్ పాటిల్ అన్నారు. కొత్తగూడెంలోని జిల్లా పాఠ్యపుస్తక గోడౌన్ బుధవారం పరిశీలించిన ఆయన ఇప్పటికే 70 శాతం పాఠ్యపుస్తకాలు జిల్లాకు చేరు కున్నాయని మిగిలినవి ఈనెల 25లోపు జిల్లా కేంద్రానికి చేరుకుంటాయని చేరుకున్న వెంటనే మండలాలకు అక్కడి నుండి పాఠశాలలకు సరఫరా చేస్తామని తెలిపారు. ఈసారి అన్ని రకాల పాఠశాలలకు సంబంధించిన పాఠ్యపుస్తకాలను మండల కేంద్రానికి చేరుస్తామని అన్ని పాఠశాలల యాజమాన్యాలు ఆయా మండలాల మండల విద్యాశాఖ అధికారి ద్వారా పాఠ్యపుస్తకాలు అందుకోవాలని ఆదేశించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు పుస్తకాలు పాఠశాలకు సరఫరా అయ్యే సమయానికి పాఠశాలల్లో అందుబాటులో ఉండి పాఠ్యపుస్తకాలను పాఠశాల పునః ప్రారంభం రోజున ప్రతి విద్యార్థికి అందించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి ఎం. వెంకటేశ్వర చారి, జిల్లా అకాడమిక్ మానిటరింగ్ అధికారి ఏ.నాగరాజశేఖర్, జిల్లా ప్లానింగ్ కోఆర్డినేటర్ ఎన్.సతీష్ కుమార్ పాల్గొన్నారు.

# ఏపీలో బౌద్ధ క్షేత్రాల్ని సరికొత్తగా తీర్చిదిద్దేందుకు కేంద్రం ప్రణాళికలు

*** ఘంటసాల బుద్ధ జయంతి వేడుకల్లో మంత్రి కందుల దుర్గేష్ వెల్లడి**

ఘంటసాల మే 14 (సమయం న్యూస్) : ఆంధ్రప్రదేశ్ లో బౌద్ధ క్షేత్రాల్ని సరికొత్తగా తీర్చిదిద్దేందుకు కేంద్రం ప్రణాళికలు రచిస్తోందని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్ వెల్లడించారు. సోమవారం కృష్ణా జిల్లా ఘంటసాలలో రాష్ట్ర ప్రభుత్వ సృజనాత్మకత, సాంస్కృతిక సమితి ఆధ్వర్యంలో జరిగిన బౌద్ధ జయంతి వేడుకలకు మంత్రి కందుల దుర్గేష్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఘంటసాల గ్రామంలోని బౌద్ధస్తూపం ప్రాంగణంలో బౌద్ధ సాహితీ చారిత్రక సదస్సులు మొదలుకొని వివిధ కార్యక్రమాలతో పాటు శయన బుద్ధ ప్రాజెక్టు ఆవరణలో భారీ సాంస్కృతిక ర్యాలీ, బౌద్ధ స్థూపం వద్ద సభ జరిగిన సభల్లో మంత్రి దుర్గేష్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమం ద్వారా సమకాలీన సమాజానికి మంచి సందేశం ఇచ్చారని పేర్కొన్నారు.ఈ సందర్భంగా బుద్ధుని జీవిత గొప్పతనాన్ని మంత్రి దుర్గేష్ వివరించారు. వేల సంవత్సరాల తర్వాత కూడా బుద్ధుడు బోధించిన శాంతి, సహనం, అహింస, శాంతియుత సహజీవనం వంటి అంశాలు నేటికీ దిక్సూచిగా నిలవడం అసాధారణమైన విషయం అన్నారు. బుద్ధుడి జీవితం ఓ పాఠం అన్నారు. ఆయన జీవితమే సందేశం అన్నారు. ఈ సందర్భంగా మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ ప్రాచీన బౌద్ధ క్షేత్రంగా పరిఢవిల్లిన ఘంటసాలలో బుద్ధ జయంతి వేడుకలు అంగరంగ వైభవంగా జరగడం ఆనందంగా ఉందన్నారు.కేంద్ర పర్యాటక శాఖ దేశంలో బౌద్ధ సర్క్యూట్ ల అభివృద్ధికి ప్రణాళికలు రచిస్తున్న నేపథ్యంలో రాష్ట్రంలో విశాఖ మొదలుకొని అమరావతి వరకు బౌద్ధారామాలు, బుద్ధుడి ఆనవాళ్లు కలిగిన ప్రాంతాలను కలిపి బుద్ధిస్ట్ సర్క్యూట్ గా చేసేందుకు ప్రతిపాదనలు పంపామని తెలిపారు. ఇప్పటికే ఈ విషయమై న్యూఢిల్లీలో కేంద్ర పర్యాటక మంత్రి గజేంద్రసింగ్ షెకావత్ ను కలిశానని ఈ క్రమంలో బుద్ధుని ఆనవాళ్లు కలిగిన దక్షిణ భారతదేశంలో ప్రత్యేకించి ఏపీకి రెండు బుద్ధిస్ట్ సర్క్యూట్ లు కేటాయించాలని కోరగా సానుకూలంగా స్పందించినట్లు మంత్రి దుర్గేష్ వివరించారు. ఈ నేపథ్యంలో బౌద్ధం ప్రచారంలోకి వచ్చిన విశాఖపట్నంలోని తొట్ల కొండ, బావి కొండ ప్రాంతాలను, బుద్ధుని సందేశాన్ని ముందుకు తీసుకెళ్లిన అమరావతి సమీపంలోని ఘంటసాల, భట్టిప్రోలు లు ప్రాంతాలను సర్క్యూట్ లు అభివృద్ధి చేసే ప్రతిపాదనకు కేంద్రం సుముఖంగా ఉందన్నారు. ఇప్పటికే సంబంధిత సర్క్యూట్ లపై ప్రత్యేక కార్యాచరణ సిద్ధం చేశామన్నారు. అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధ ప్రసాద్ విజ్ఞప్తి మేరకు



ఘంటసాల సమీపంలోని పలు పర్యాటక ప్రాంతాలను కలిపి విస్తృతమైన సర్క్యూట్ ను ఏర్పాటు చేసేందుకు కార్యాచరణ రూపొందిస్తామన్నారు. సత్యాన్వేషణ కోసం సంచరించి బోధి వృక్షం క్రింద మహా ధ్యానం చేసి జ్ఞానం పొందిన మహా వ్యక్తి గౌతమ బుద్ధుని జన్మ జ్ఞాపకార్థం నిర్వహించిన బుద్ధ జయంతి వేడుకల్లో పాలుపంచుకోవడం ఆనందంగా ఉందని మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. బౌద్ధ క్షేత్రంగా విరాజిల్లిన ఘంటసాలలో బుద్ధ పౌర్ణమి కార్యక్రమాన్ని ఏపీ ప్రభుత్వం తరపున రాష్ట్రస్థాయి కార్యక్రమంగా ఏర్పాటు చేసిన సీఎం చంద్రబాబునాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ల ధన్యవాదాలు తెలిపారు. క్రీ.పూ రెండు మూడు శతాబ్దాల స్థూపం దగ్గర కార్యక్రమం ఏర్పాటు చేయడం గర్వించదగ్గ విషయమన్నారు. భారతదేశానికి చెందిన మనమంతా శాంతికి అనుకూలమన్నారు. శాంతి వచనాలు అమలు చేసే దృక్పథం ఉన్న జాతి భారత జాతి అని తెలిపారు. ప్రత్యర్థులకు ఏ రకమైన సమాధానం చెప్పాలో ఇప్పటికే నిరూపించామని, అవసరమైతే మళ్లీ చెబుతామని పరోక్షంగా పాకిస్థాన్ అంశాన్ని ఉదహరించారు. కార్యక్రమంలో మచిలీపట్నం ఎంపీ వల్లభనేని బాలశౌరి, అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధ ప్రసాద్, గన్నవరం శాసనసభ్యులు యార్లగడ్డ వెంకట్రావు, రాజ్యసభ మాజీ సభ్యులు రవీంద్ర, ఆంధ్రప్రదేశ్ సృజనాత్మకత మరియు సంస్కృతి సమితి సంచాలకులు రేగుళ్ల మల్లికార్జునరావు, జడ్పీ మాజీ వైస్ చైర్మన్ గొర్రెపాటి వెంకట రామకృష్ణ, అధికారులు, కూటమి నాయకులు, బౌద్ధ బిక్షువులు తదితరులు పాల్గొన్నారు.



## స్ట్రామ్ వాటర్ డ్రైయిన్ పనులు ప్రారంభించిన కార్పొరేటర్ స్వర్ణరాజ్ శివమణి

కాప్రా, మే 14, (సమయం న్యూస్) కాప్రా డివిజన్ కార్పొరేటర్ శ్రీ స్వర్ణరాజ్ శివమణి గారు డివిజన్ లో పర్యటించి సైనిక్ పురి హైటెన్షన్ లెన్ డిమార్ట్ నుండి కాప్రా చెరువు వరకు స్ట్రామ్ వాటర్ డ్రైయిన్ పనులు ప్రారంభించారు. అనంతరం గెలీలియో నగర్ లోని ఫుట్ బాల్ గ్రౌండ్ లో అదనపు గదుల నిర్మాణం చేపట్టాలని అధికారులకు ఆదేశించారు. ఈ సందర్భంగా స్వర్ణరాజ్ శివమణి మాట్లాడుతూ సైనిక్ పురి హైటెన్షన్ రోడ్ లో వర్షపు నీరు నిలుచే సమస్య తో దశాబ్దాలుగా అవస్థలు పడుతున్న పరిసర కాలనీల ప్రజలు, వాహన దారులకు స్ట్రోమ్ వాటర్ డ్రైయిన్ నిర్మాణ పనులతో అవస్థలు తీరనున్నాయని తెలిపారు. రూ. 68లక్షల వ్యయంతో ఈ నిర్మాణం చేపడుతున్నామని తెలిపారు. కాప్రా డివిజన్ అభివృద్ధికై ప్రభుత్వ సహకారం సంపూర్ణంగా లభిస్తుండడం తో అభివృద్ధి పనులు వేగవంతగా చేపడుతున్నామని తెలిపారు. అనంతరం గెలీలియో నగర్ లో గల ఫుట్ బాల్ గ్రౌండ్ లో క్రీడాకారులకు అదనపు గదులు నిర్మించాలని అధికారులకు ఆదేశించారు. క్రీడలు యువత మానసిక స్టైర్యాన్ని, శారీరక దృఢత్వానికి దోహద పడతాయని, ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని, యువత చెడుదారి పట్టకుండా క్రీడలపై ఆసక్తి పెంచుకొని జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో దేశప్రతిష్టను చాటాలని అన్నారు. ఈ కార్యక్రమంలో GHMC కాప్రా డిప్యుటీ ఇంజనీర్ శ్రీ బాలకృష్ణ గారు, అసిస్టెంట్ ఇంజనీర్ శ్రీ సూరజ్ గారు సిబ్బంది, కాప్రా డివిజన్ సీనియర్ కాంగ్రెస్ నాయకులు శ్రీ పవన్ కుమార్ గారు, డివిజన్ యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షులు శ్రీ జి అరుణ్ కిరణ్ గారు, యూత్ కాంగ్రెస్ నాయకులు మనోజ్ కుమార్, దయాకర్, విజయ్ కుమార్, అభిరామ్ తదితరులు పాల్గొన్నారు.

# పుష్కరాలలో భక్తులకు ఇబ్బందులు లేకుండా అప్రమత్తంగా ఉండాలి

కాళేశ్వరం, మే 14 (సమయం న్యూస్) : సరస్వతి పుష్కర విధులు కేటాయయించిన సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని, భక్తులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా ఈ 12 రోజులు అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు. బుధవారం కాలేశ్వరం దేవస్థానంలోని కళ్యాణ మండపంలో విధులు కేటాయించిన వివిధ శాఖల అధికారులు, సిబ్బందితో సమావేశం నిర్వహించి కేటాయించిన విధుల పట్ల దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మన జిల్లాలో పెద్ద ఎత్తున సరస్వతి పుష్కరాలు జరుపుతున్నామని, అందుకు తగినట్లుగా అన్ని ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. ప్రతిరోజు లక్షకిపైగా భక్తులు వచ్చే అవకాశం ఉన్నందున అధికార యంత్రం ఆసాంతం అప్రమత్తంగా ఉన్నట్లు స్పష్టం చేశారు. ప్రతి అధికారికి కేటాయించిన లొకేషన్స్ లో ముందస్తుగా పర్యటించి ఏర్పాట్లు పరిశీలన చేయాలని తెలిపారు. గైర్హాజరైన అధికారులకు, సిబ్బందికి ఆయా శాఖలకు తగు చర్యలు



నిమిత్తం సిఫారసు చేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు. 15వ తేదీ ఉదయం పుష్కరాలు ప్రారంభమవుతాయని రాష్ట్ర ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు పుష్కరాలను ప్రారంభించనున్నారని తెలిపారు. 15వ తేదీ సాయంత్రం 5 గంటలకు రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ రేవంత్ రెడ్డి సరస్వతి మాత విగ్రహం ఆవిష్కరణ, పుష్కర స్నానం తదుపరి స్వామి వారి దర్శనం, గోదావరి హారతి కార్యక్రమాల్లో పాల్గొని ప్రత్యేక పూజలు చేస్తారని అనంతరం టెంట్ సిటీ పరిశీలిస్తారని తెలిపారు. కాశీ పండితులతో ప్రత్యేకంగా హారతి కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 12సంవత్సరాలకు ఒకసారి జరుగుతున్న ఈ పుష్కరాలను రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్నదని అన్నారు. కుంభమేళా వెళ్లలేని వారు ఇక్కడికి వచ్చే అవకాశం ఉందని ఆ ప్రకారం అన్ని ఏర్పాట్లు సిద్ధం చేసినట్లు ఆయన తెలిపారు. ఈ 12 రోజుల విధులు చాలా ముఖ్యమని ఎలాంటి ఇబ్బందులు రాకుండా సమన్వయంతో పని చేయాలని సూచించారు. సరస్వతి ఘాట్ మెయిన్ ఘాట్ వద్ద భక్తులు పుష్కర స్నానాలు చేసేందుకు తగిన ఏర్పాట్లు చేసినట్లు ఆయన వివరించారు. దేవాలయంలో భక్తులు క్యూలైన్ పాటించేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. 50 మంది గజ ఈతగాళ్ళు నాటు పడవలతో పహారా కాస్తున్నట్లు తెలిపారు. విధులు నిర్వహించే అధికారులు సిబ్బందిని పర్యవేక్షణ చేస్తూ ఎలాంటి సమస్య రాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. తాత్కాలిక బస్టాండ్ నుంచి ఘాట్స్ వరకు భక్తుల సౌకర్యార్థం ఉచితంగా 30 షటిల్ బస్సులు నడుపుతున్నామని భక్తులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. స్విమ్మర్లు లైఫ్ బాయ్స్, జాకెట్స్ ధరించాలని గోదావరిలో ఏ ఒక్కరు మిస్ అయిన విధులకు ఇబ్బంది కలుగుతుందని అత్యంత అప్రమత్తంగా ఉండాలని ఆయన సూచించారు. ఈ సమావేశంలో దేవాదాయశాఖ డైరెక్టర్ వెంకటరావు, అదనపు కలెక్టర్లు అశోక్ కుమార్, విజయలక్ష్మి, కాటారం సబ్ కలెక్టర్ మయాంక్ సింగ్, ఆర్డిఓ రవి అన్ని శాఖల జిల్లా అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## సర్కారు భూములను ఆక్రమిస్తే కఠిన చర్యలు

*** జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్.**

నిర్మల్ మే14( సమయం న్యూస్) : జిల్లాలో ప్రభుత్వ భూములను అక్రమంగా ఆక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ బుధవారం ఒక ప్రకటనలో హెచ్చరించారు. ఇటీవల జిల్లాలోని కొన్ని ప్రాంతాల్లో సర్కారు భూములు ఆక్రమణకు గురవుతున్న విషయాలు గుర్తించామని, వాటిని రెవెన్యూ అధికారులు వెంటనే స్వాధీనం చేసుకున్నారని తెలిపారు. ఈ నేపథ్యంలో రెవెన్యూ అధికారులకు సర్కారు భూములపై ఎటువంటి ఆక్రమణను అయినా కఠినంగా అణచివేయాలని సూచించడం జరిగిందని కలెక్టర్ వెల్లడించారు.



ఇప్పటికే పలు మండలాల్లో రెవెన్యూ శాఖ సర్వేలు చేపట్టి, చర్యలు తీసుకుంటోందని తెలిపారు. ప్రభుత్వ భూముల పరిరక్షణకు ప్రజలు సహకరించాలని, ఇకపై అక్రమాలకు పాల్పడిన వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ స్పష్టం చేశారు.

# బిల్లులు చెల్లించాలని మున్సిపాలిటీ కార్యాలయానికి తాళం

తొర్రూరు: పెండింగ్ బిల్లులు చెల్లించాలని డిమాండ్ చేస్తూ మహబూబాబాద్ జిల్లా తొర్రూరు మున్సిపాలిటీ కార్యాలయానికి ఓ ప్రైవేటు గుత్తేదారు తాళం వేసిన సంఘటన బుధవారం సాయంత్రం చోటు చేసుకుంది. గుత్తేదారు జలగం శంకర్ మాట్లాడుతూ.. నాలుగేళ్లుగా మున్సిపాలిటీ ఆధ్వర్యంలో నిర్వహించే బతుకమ్మ, దసరా, ఇతర కార్యక్రమాలకు డెకరేషన్, ఎల్ఈడీ తెరతోపాటు ఇతర సౌకర్యాలు కల్పిస్తున్నానని.. ఇప్పటి వరకు రూ.16.80 లక్షల బకాయిలు రావాల్సి ఉందన్నారు. పలుమార్లు మున్సిపల్ కమిషనర్



శాంతికుమార్‌ను కలిసి విన్నవించినా పట్టించుకోవడం లేదని, తాను తీవ్ర ఆర్థిక ఇబ్బందుల్లో కూరుకుపోయానని వాపోయారు. దీనిపై కమిషనర్‌ను 'న్యూస్‌టుడే' వివరణ కోరగా.. గుత్తేదారు ఇంతవరకు సమస్యను తన దృష్టికి తీసుకురాలేదని, ఆయన చేసిన పనికి టెండర్ లేదని, దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేస్తామని తెలిపారు.



# రెవిన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలి

* **కలెక్టర్ జితేష్ పాటిల్**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, మే 14(సమయం న్యూస్): భూ సమస్యలు ఉన్నవారు రెవెన్యూ సదస్సులో పాల్గొని దరఖాస్తులు అందజేసిన వెంటనే భూ సమస్యలు పరిష్కారం చేస్తామని జిల్లా కలెక్టర్ జితేష్ పాటిల్ పేర్కొన్నారు. భూ భారతి చట్టం అమలులో భాగంగా రెవెన్యూ సదస్సుల నిర్వహణకు పైలట్ ప్రాజెక్టుగా సుజాతానగర్ మండలం ఎంపికైన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా బుధవారం సుజాతానగర్ మండలంలోని సర్వారం, కోయగూడెం గ్రామాల్లో భూ భారతిలో భూ సమస్యలపై రైతులు ఇచ్చిన దరఖాస్తులను కలెక్టర్ పరిశీలించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ఈ రెవెన్యూ సదస్సులో భూ రికార్డులలో పేర్లు తప్పులు భూమి విస్తీర్ణం హెచ్చు తగ్గులు వారసత్వ భూములు భూ స్వభావం తప్పులు నిషేధిత జాబితాలో ఉన్న భూ సమస్యలు సర్వే నెంబర్ మిస్సింగ్ పట్టా పాస్ బుక్కులు లేకపోవడం ప్రభుత్వ భూములను నవీకరించడం సాదాబైనామా కేసులు హద్దుల నిర్ధారణ పార్ట్‌బిలో చేర్చిన భూముల సమస్యలు భూసేకరణ కేసులు తదితర భూ సమస్యలకు సంబంధించి దరఖాస్తులు స్వీకరించి భూ భారతి కొత్త ఆర్.ఓ.ఆర్ చట్టం ప్రకారం అధికారులు క్షేత్రస్థాయిలో విచారణ చేపడుతారన్నారు. అలాగే నిర్దేశిత గడువు లోపు భూములు పరిష్కరిస్తారన్నారు. మండలంలోని రెవెన్యూ గ్రామాల్లో సదస్సులు పూర్తయ్యాక జిల్లాలోని అన్ని మండలాల్లో జూన్ మొదటి వారంలో రెవెన్యూ గ్రామాల వారీగా సదస్సులు నిర్వహిస్తామన్నారు. అర్జీలు సమర్పించేందుకు వచ్చే వారికి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని తహసీల్దార్‌ను అదేశాంచారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ వెంట కొత్తగూడెం ఆర్డీవో మధు, సుజాతనగర్ తాసిల్దార్ శిరీష, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఫోన్లు పోతే సిఈఐఆర్ పోర్టల్ ద్వారా రికవరీ చేసి తిరిగి ఇస్తాం

* **భద్రాద్రి జిల్లా ఎస్పీ రోహిత్ రాజు**
* **రికవరీ చేసిన 150 మొబైల్ ఫోన్లను బాధితులకు అప్పగింత**
* **మొబైల్ ఫోన్లను రికవరీ చేసిన పోలీస్ అధికారులు సిబ్బందికి ఎస్పి ప్రశంసలు**




భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి మే 14 (సమయం న్యూస్): జిల్లా వ్యాప్తంగా అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలో మొబైల్ ఫోన్లను పోగొట్టుకున్న భాదితులకు సిఈఐఆర్ పోర్టల్ ద్వారా రికవరీ చేసి తిరిగి వారికి అందజేయడం జరుగుతుందని జిల్లా ఎస్పీ రోహిత్ రాజు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలో సిఈఐఆర్ పోర్టల్ ద్వారా అందుకున్న ఫిర్యాదులతో బాధితులు కోల్పోయిన మొబైల్ ఫోన్లను కనిపెట్టడం జరిగితుందన్నారు. గత రెండు నెలల వ్యవధిలో మొబైల్ ఫోన్లను పోగొట్టుకున్న 150 మంది బాధితులకు బుధవారం జిల్లా ఎస్పీ కార్యాలయంలో తిరిగి వారి ఫోన్లను అప్పగించడం జరిగింది. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ మొబైల్ ఫోన్లను పోగొట్టుకున్న బాధితులు వెంటనే సిఈఐఆర్ పోర్టల్ లో ఆన్లైన్ ద్వారా అడిగిన అన్ని రకాల వివరాలను కచ్చితంగా నమోదు చేసుకుంటే సంబంధిత పోలీస్ స్టేషన్ నుండి తిరిగి వారి మొబైల్ ఫోన్లను ట్రాక్ చేసి కనిపెట్టడం జరుగుతుందని తెలిపారు. ఎవరైనా తమ మొబైల్ దొంగిలించబడినా పోగొట్టుకున్నా వెంటనే సిఈఐఆర్ పోర్టల్ ద్వారా తిరిగి వారి మొబైల్ ఫోన్లను పొందవచ్చునని తెలిపారు. గడిచిన ఐదు నెలల కాలంలో మొత్తం 743 మొబైల్ ఫోన్లను కనిపెట్టి బాధితులకు అందజేయడం జరిగిందని వివరించారు. పోర్టల్ ద్వారా పోగొట్టుకున్న తమ మొబైల్ ఫోన్ వివరాలను పొందుపరిచి ఫిర్యాదు చేయగలిగితే అట్టి ఫోన్లను సులభంగా కనిపెట్టవచ్చని ఎస్పీ తెలిపారు. పోగొట్టుకున్న మొబైల్ ఫోన్ ను అవతల వ్యక్తి వినియోగించాలని ప్రయత్నించినప్పుడు మాత్రమే అట్టి మొబైల్ ను ట్రేస్ చేయగలమని అన్నారు. ఈ సందర్భంగా బాధితుల మొబైల్ ఫోన్లను కనిపెట్టి వారికి అందజేయడంలో కృషి చేసిన జిల్లా పోలీస్ అధికారులు సిబ్బందిని ఎస్పీ అభినందించారు. అనంతరం వారికి ప్రశంసా పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎస్పి ఇన్స్పెక్టర్ శ్రీనివాస్, ఐటి సెల్ ఇంచార్జి సీఐ రాము, ఎస్సై సురేష్, ఐటి సెల్ సభ్యులు నవీన్, నరేష్, మహేష్, నరేన్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వం నోటిఫై చేసిన...

# వరి విత్తనాలనే వినియోగించేలా అవగాహన కల్పించాలి

* **కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు**
* **వన మహోత్సవానికి అన్ని విధాలుగా సన్నద్ధం కావాలి**
* **వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అధికారులకు దిశానిర్దేశం**



నిజామాబాద్, మే 14 (సమయం న్యూస్): ఖరీఫ్ సీజన్ లో రాష్ట్ర ప్రభుత్వం నోటిఫై చేసిన (గుర్తించబడిన) వరి విత్తనాలనే జిల్లా రైతులు వినియోగించేలా క్షేత్రస్థాయిలో వారికి అవగాహన కల్పించాలని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు అధికారులకు సూచించారు. బుధవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం నుండి కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఆర్డీఓలు, మున్సిపల్ కమిషనర్లు, ఎంపిడిఓలు, తహసీల్దార్లు, మండల వ్యవసాయ అధికారులు, హౌసింగ్ ఏ.ఈలు, ఎపిఓలు, సహకార శాఖ అధికారులు, పంచాయతీ కార్యదర్శులతో సుదీర్ఘ సమీక్ష జరిపారు. ఖరీఫ్ పంటల సాగు ప్రణాళిక, అందుబాటులో ఉన్న ఎరువులు, విత్తన నిల్వలు, లైసెన్సుడ్ సర్వేయర్ల శిక్షణ, రేషన్ (ఆహార భద్రత) కార్డుల పరిశీలన, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల ప్రగతి, వన మహోత్సవం, రాజీవ్ యువశక్తి దరఖాస్తుల పరిశీలన తదితర అంశాల ప్రగతిని కలెక్టర్ ఒక్కో మండలం వారీగా సమీక్షిస్తూ, అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఈసారి ఖరీఫ్ లో జిల్లా వ్యాప్తంగా 5.62 లక్షల ఎకరాల విస్తీర్ణంలో వివిధ రకాల పంటలు సాగు చేస్తారని అంచనా కాగా, అందులో ఒక్క వరి పంటనే 4.37 లక్షల ఎకరాలలో సాగు చేసే అవకాశాలు ఉన్నాయని కలెక్టర్ తెలిపారు. సన్నాలకు ప్రభుత్వం క్వింటాలుకు రూ. 500 చొప్పున బోనస్ అమలు చేస్తున్న నేపథ్యంలో పూర్తి విస్తీర్ణంలో సన్నరకం వరి పంట సాగు చేస్తారని భావిస్తున్నామని అన్నారు. అయితే ప్రభుత్వంచే గుర్తించబడిన సన్న రకాల ధాన్యం మాత్రమే కాకుండా మరికొన్ని ఇతర రకాల వరి వంగడాలను జిల్లాలోని కొంతమంది రైతులు వినియోగిస్తుండడం వల్ల ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలలో ధాన్యం సేకరణ సందర్భంగా పలు ఇబ్బందులు ఏర్పడుతున్నాయని అన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకుని ఖరీఫ్ లో రైతులు ప్రభుత్వంచే గుర్తించబడిన 33 రకాల సన్న రకం వరి వంగడాలను వినియోగించేలా చూడాలన్నారు. సిద్ధి (డబ్ల్యుజిఎల్ 44), కాంపసాగర్ వేరైటి 1 (కేపిఎస్ 2874), సాంబ మసూరి (బిపిటి 5204), జగిత్యాల వేరైటి 3 (జిజిఎల్ 27356), జగిత్యాల వేరైటి 2 (జెజిఎల్ 28545), వరంగల్ సాంబా (డబ్ల్యుజిఎల్ 14), వరంగల్ సన్నాలు (డబ్ల్యుజిఎల్ 32100), జగిత్యాల మసూరి (జెజిఎల్ 11470), పోలాస ప్రభ (జెజిఎల్ 384), కృష్ణ (ఆర్ఎన్ఆర్ 2458), మానేరు సోనా (జెజిఎల్ 3828), తెలంగాణ సోనా (ఆర్ఎన్ఆర్ 15048), వరంగల్ వేరైటి 1119, కూనారం వేరైటి 2 (కేఎన్ఎమ్ 1638), వరంగల్ వేరైటి 2 (డబ్ల్యుజిఎల్ 962), రాజేంద్రనగర్ వేరైటి 4 (ఆర్ఎన్ఆర్ 21278), కూనారం వేరైటి 1 (కేఎన్ఎమ్ 733), జగిత్యాల సన్నాలు (జెజిఎల్ 1798), జగిత్యాల సాంబా (జెజిఎల్ 3844), కరీంనగర్ సాంబా (జెజిఎల్ 3855), అంజన (జెజిఎల్ 11118), నెల్లూరు మసూరి (ఎన్ఎల్ఆర్ 34449), ప్రత్యుమ్న (జెజిఎల్ 17004), సుగంధ సాంబా (ఆర్ఎన్ఆర్ 2465), శోబిని (ఆర్ఎన్ఆర్ 2354), సోమనాథ్ (డబ్ల్యుజిఎల్ 347), ఆర్ఎన్ఆర్ 31479 (పిఆర్‌సి), కేపిఎస్ 6251 (పిఆర్‌సి), జెజిఎల్ 33124 (పిఆర్‌సి), హెచ్ఎమ్‌టి సోనా, మరుటేరు సాంబా (ఎంటీయూ 1224), మరుటేరు మసూరి (ఎంటీయూ 1262), ఎంటీయూ 1271 రకాలకు చెందిన సన్న ధాన్యం వరి వంగడాలను విత్తుకోవాలని కలెక్టర్ సూచించారు. మొక్కల పంపిణీ కోసం నర్సరీలలో సరిపడా మొక్కలు అందుబాటులో ఉంచాలని, పంపిణీ చేసే ప్రతి మొక్కను నాటి కాపాడుకునేలా చూడాలన్నారు. పూర్తిస్థాయి లక్ష్యానికి అనుగుణంగా జిల్లాలో మొక్కల పెంపకం జరగాలన్నారు. వీడియో కాన్ఫరెన్స్ లో అదనపు కలెక్టర్లు అంకిత్, కిరణ్ కుమార్, బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో, డీఆర్డీఓ సాయాగౌడ్, నగర పాలక సంస్థ కమిషనర్ దిలీప్ కుమార్, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.



# అటవీ ప్రాంతంలో అభివృద్ధి పనులు చేపట్టేందుకు చర్యలు

* **జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్**

నిర్మల్ మే 14, (సమయం న్యూస్) : అటవీ ప్రాంతాలలో అభివృద్ధి పనులను చేపట్టేందుకు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. జిల్లాలో ఆర్ఎఫ్ఆర్ (రైట్ ఫుల్ ఫారెస్ట్ రూల్స్) అమలుపై బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో అటవీ, విద్యుత్, ఆర్ అండ్ బి, పంచాయతీరాజ్ శాఖల అధికారులతో కలెక్టర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, అటవీ ప్రాంతాలలో అభివృద్ధి పనులను చేపట్టేందుకు సంబంధిత శాఖల అధికారులు సమన్వయము తో పనిచేయాలని ఆదేశించారు. మారుమూల అటవీ, గిరిజన ప్రాంతాలలో రహదారులు, బ్రిడ్జిలు, విద్యుత్ తదితర అభివృద్ధి పనులు చేపట్టేందుకు సంబంధిత అధికారులు అటవీశాఖకు సరైన విధంగా ప్రపోజల్స్ సిద్ధం చేసి పంపించాలని సూచించారు. అభివృద్ధి పనులు చేపట్టాల్సిన ప్రతి శాఖ తమ ప్రపోజల్స్‌ను అటవీశాఖతో సమన్వయం చేసుకుని ముందుగా ఆమోదం పొందాలన్నారు. చేపట్టనున్న అభివృద్ధి ప్రాజెక్టులను త్వరితగతిన అమలు చేసేందుకు కార్యాచరణ రూపొందించుకోవాలని ఆదేశించారు. శాఖల మధ్య సమన్వయంతో అభివృద్ధి కార్యక్రమాలు త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. అటవీశాఖ అవసరమైన మార్గదర్శకాలను సంబంధిత శాఖలకు త్వరితగతిన పంపించాలని కలెక్టర్ సూచించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ కిషోర్ కుమార్, సంబంధిత శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.




# కార్మికులకు కౌన్సిలింగ్

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, మే 14(సమయం న్యూస్): కొత్తగూడెం ఏరియాలోని రుద్రంపూర్ ఆర్.సి.ఓ.ఎ క్లబ్ నందు 2025 సంవత్సరంలో జనవరి నుండి ఏప్రిల్ వరకు 60 మాస్టర్లు, అంతకన్నా తక్కువ మాస్టర్లు చేసిన ఉద్యోగులకు వారి కుటుంబ సభ్యులతో గైర్హాజరు హాజరవుతున్న ఉద్యోగులకు విధులకు హాజరవ్వాలని బుధవారం కౌన్సిలింగ్ ను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కొత్తగూడెం ఏరియా జనరల్ మేనేజర్ ఎం.షాలేం రాజు మాట్లాడుతూ విధులకు గైర్హాజరు అవుతూ ఈ సంవత్సరం 2025లో జనవరి నుండి ఏప్రిల్ వరకు 60 మాస్టర్లు, అంతకన్నా తక్కువ మాస్టర్లు చేసిన ఉద్యోగులను వారి కుటుంబ సభ్యుల సమక్షంలో గైర్హాజరు కాకుండా విధులకు హాజరయ్యేలా వారిని ప్రోత్సహించడానికి ఈ కౌన్సిలింగ్ కు పిలవడం జరిగిందని అన్నారు. ఈ కౌన్సిలింగ్ కు 295 ఉద్యోగులను కౌన్సెలింగ్ కు పిలవడం జరిగిందని వారిలో కౌన్సిలింగ్ కు 140 మంది ఉద్యోగులు హాజరైనారని హాజరైన ప్రతి ఉద్యోగి గైర్హాజరు అవుటకు గల కారణాలను జిఎం ఈ సందర్భంగా అడిగి తెలుసుకున్నారు. అలాగే మెడికల్ కారణంగా విధులకు హాజరుకాని ఉద్యోగులను సంబంధిత అధికారులతో వారి ఆరోగ్య స్థితిగతులను మెడికల్ డిపార్ట్మెంట్ వారితో రివ్యూ చేయించాలని సూచించారు. ఈ కౌన్సిలింగ్ కు సంబంధిత అధికారులు మెడికల్ సూపరిడెంట్ ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగింది. గైర్హాజరుకు కారణాలు అడిగి తెలుసుకొని గైర్హాజరు వలన వారికి వారి కుటుంబాలకు సంస్థకు కలిగే నష్టాలను వివరించి రోజువారీగా విధులకు హాజరవ్వాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జిఎంతో పాటు కొత్తగూడెం ఏరియా ఏఐటియుసి అసిస్టెంట్ బ్రాంచ్ సెక్రటరీ జె.గట్టయ్య, ఐఎన్టీయూసీ వైస్ ప్రెసిడెంట్ ఎండి. రజాక్, ఎస్ఓటు జిఎం జీవి కోటిరెడ్డి, డిజిఎం(పర్సనల్) బి.శివకేశవరావు, ఏజెంట్ పద్మావతి ఖని బి.రవీందర్, మేనేజర్ పద్మావతి ఖని ఎం.వి.ఎస్ శ్యాం ప్రసాద్, డాక్టర్ శ్రీనివాస్ రెడ్డి, డివైపిఎం హరీష్ గోవర్ధన్, సీనియర్ పిఓలు మజ్జి. మురళి, కే.దేవదాస్, డి.విజయ సందీప్, జి.సంఘమిత్ర, షకీల్, కావ్య సంబంధిత సిబ్బంది పాల్గొన్నారు.

# ఉప్పల్ భాగాయత్‌లో దారుణం

అంబర్ పేట, మే,14 (సమయం న్యూస్) : నిన్న ఇద్దరు మైనర్ బాలురు మిస్సింగ్.. నేడు పిల్లర్ గుంతలో బాలుర మృతదేహాలు లభ్యం. ఉప్పల్ భాగాయత్ ప్రాంతంలో సుజాత, వెంకటేష్ దంపతుల ఇద్దరు కుమారులు అర్జున్ (8), మణికంఠ(15) నిన్న మిస్సింగ్ భాగాయత్‌లో కుల సంఘాల భవన నిర్మాణం జరుగుతున్న పిల్లర్ గుంతలో లభ్యమైన అర్జున్ (8) మణికంఠ(15) మృతదేహాలు. ఈత కోసం వెళ్లారా లేదా ఏదైనా అనుమానాస్పదమా అనే కోణంలో పోలీసులు దర్యాప్తు జోగులాంబ గద్వాల జిల్లాకు చెందిన సుజాత, వెంకటేష్ దంపతులు పొట్టకూటి కోసం ఉప్పల్ కుర్మా నగర్‌లో ఫ్లైఓవర్ బ్రిడ్జి పనులు చేయడానికి



వలస వచ్చిన సుజాత, వెంకటేష్ దంపతులు బతుకుదెరువు కోసం వచ్చి పిల్లలను పోగొట్టుకున్నామని తల్లిదండ్రుల ఆవేదన సుజాత, వెంకటేష్ దంపతులకు ఇద్దరు కుమారులు మణికంఠ(15), అర్జున్ (8), ఒక కూతురు.

# కాళేశ్వరంలో సరస్వతి పుష్కరాలకు హాజరు కానున్న సి.ఎం. రేవంత్ రెడ్డి

* **సి.ఎం. చే సరస్వతి పుష్కర ఘాట్ ప్రారంభం**

హైదరాబాద్, మే 14(:సమయం న్యూస్): జయశంకర్ భూపాల్ పల్లి జిల్లా కాళేశ్వరంలో మే 15 వ తేదీన ప్రారంభం కానున్న సరస్వతి పుష్కరాల సందర్భంగా త్రివేణి సంగమం వద్ద సరస్వతి ఘాట్ ను రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ప్రారంభిస్తారు. ఈ పుష్కర ఘాట్ ప్రారంభం అనంతరం, కాళేశ్వర త్రివేణీ సంగమంలో ముఖ్యమంత్రి పుణ్యస్నానం ఆచరిస్తారు. ముఖ్యమంత్రి తోపాటు పలువురు మంత్రులు కూడా ఈ పుష్కరాలలో పాల్గొంటారు. 12 సంవత్సరాలకు ఒకసారి వచ్చే ఈ అరుదైన సరస్వతి మహా పుష్కరాలకు రాష్ట్ర ప్రభుత్వ దేవాదాయ శాఖ విస్తృత ఏర్పాట్లు చేసింది. రేపు , (15న) ఉదయం 5.44 గంటలకు తొగుట ఆశ్రమం పీఠాధిపతి మాధవానంద సరస్వతి స్వామీజీ సంకల్పంతో పాటు పుష్కర స్నానం ఆరంభిస్తారు. ప్రతీ రోజూ ఉదయం 8 .30 గంటలనుండి 11 గంటల వరకు యాగాలు నిర్వహిస్తారు. ప్రతీ రోజూ సరస్వతి ఘాట్ లో 6 .45 నుండి 7 .35 గంటల వరకు సరస్వతి ఘాట్ లో ప్రత్యేక సరస్వతి నవరత్న మాలహారతి నిర్వహిస్తారు. పుష్కర్ స్నానం ఆచరించేవారికి తాత్కాలిక టెంట్ సిటీ లను ఏర్పాటు చేశారు. వీటితో పాటు రోజూ రాత్రి కళా, సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.

* **12 యేళ్ల తర్వాత బృహస్పతి మిధునరాశిలో ..**

సరస్వతి నదిని కాళేశ్వరం త్రివేణి సంగమం వద్ద ప్రవహించే "అంతర్వాహిని" (అదృశ్య నది) గా పరిగణిస్తారు. ఈ పుష్కరాన్ని బృహస్పతి మిథున రాశి ( మిథునరాశి )లోకి ప్రవేశించినప్పటి నుండి 12 రోజుల పాటు ఆచరిస్తారు. బృహస్పతి దేవ గురువు . బృహస్పతి జ్ఞానం, విద్య , ఆధ్యాత్మికతకు అధిపతిగా పరిగణించబడుతున్నాడు. బృహస్పతిని గురుగ్రహం అని కూడా అంటారు. గురువు ఏడాదికి ఒకసారి తన రాశిని మార్చుకుంటాడు. ఒక రాశి నుంచి వెళ్లిన తర్వాత అదే రాశిలోకి అడుగు పెట్టడానికి 12 యేళ్లు పడతాయి. ఏ రాశి లో సంచరిస్తాడో ఆ రాశి వారికి శుభప్రదంగా ఉంటుంది. ఈ సంవత్సరం మే 14 న రాత్రి 10.35 గం మిథునరాశిలోకి బృహస్పతి అడుగు పెట్టనున్నాడు. సరస్వతి నది అంతర్వాహినిగా కాళేశ్వరం దగ్గర ప్రవహిస్తుంది .. 2025 మే 14న రాత్రి 10.35 గంటలకు బృహస్పతి మిథున రాశిలోకి ప్రవేశించే సమయంలో పుష్కరకాలం ప్రారంభమవుతుందని.. మరుసటి రోజు సూర్యోదయం నుంచి పుష్కర పుణ్యస్నానాలు ఆచరించాల్సి ఉంటుందని కాళేశ్వరం పుణ్యక్షేత్ర ఆలయ అర్చకులు వివరించారు. మే 15 నుంచి 26 వరకు పుష్కర కాలం ఉంటుందని వివరించారు.

# ట్రాన్స్ జెండర్ లకు గౌరవమైన జీవన భృతి కల్పించేందుకు ప్రభుత్వం కృషి

హైదరాబాద్, మే 14:( సమయం న్యూస్) సమాజంలో ట్రాన్స్ జెండర్ లకు గౌరవమైన జీవన భృతి కల్పించే దిశగా రాష్ట్ర ప్రభుత్వం అడుగులు వేస్తోందని అడిషనల్ కమిషనర్లు స్నేహ శబరీష్, చంద్ర కాంత్ రెడ్డి లు అన్నారు. బుధవారం జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలోని పన్వర్ హాల్ లో ట్రాన్స్ జెండర్ ల ప్రతినిధులు, ఎన్.జి.ఓ లతో యు.సి.డి విభాగం ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ట్రాన్స్ జెండర్ ల సేవలను జీహెచ్ఎంసీలోని వివిధ విభాగాలలో వినియోగించే అంశంపై వారి సూచనలు, అభిప్రాయాలను తీసుకున్నారు. ఈ సందర్భంగా అడిషనల్ కమిషనర్ స్నేహ శబరీష్ మాట్లాడుతూ... ట్రాన్స్ జెండర్ ల ఆసక్తి, అర్హతల మేరకు జీహెచ్ఎంసీలో ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించడానికి చేపట్టే చర్యల్లో భాగంగా ఈ సమావేశం ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. జీహెచ్ఎంసీలో మాత్రమే కాకుండా ఇతర విధాల ఉపాధి పొందడానికి వారికి శిక్షణలు కూడా ఇస్తారని తెలిపారు. యు.సి.డి అడిషనల్ కమిషనర్ చంద్రకాంత్ రెడ్డి మాట్లాడుతూ... గౌ ముఖ్యమంత్రి




ఆదేశాల మేరకు జీహెచ్ఎంసీలో పలు ఉద్యోగ అవకాశాలు, ట్రాన్స్ జెండర్ వినియోగించుకొని ఆర్థికంగా నిలదొక్కుకోవాలన్నదే ముఖ్యమంత్రి నిర్ణయమని, అందుకు తమ తమ విద్యా అర్హతలు, నైపుణ్యత, ఆసక్తుల మేరకు అనువైన రంగాన్ని ఎంచుకోవాలని, దానికి తగ్గట్టుగా శిక్షణ ఇచ్చి ఉపాధి కల్పించడానికి చర్యలు తీసుకోనున్నట్లు వివరించారు. ఉద్యోగ అవకాశాలు కు అర్హత లేని ట్రాన్స్ జెండర్లను స్వయం సహాయక గ్రూపులు ఏర్పాటు చేసి ఆర్థిక ఎదుగుదలకు దోహద పడే విధంగా కూడా జిహెచ్ఎంసి కృషి చేస్తుందన్నారు ఇప్పటికే మూడు ట్రాన్స్ జెండర్ ల ఎస్.హెచ్.జి గ్రూపులను ఏర్పాటు చేసి బ్యాంకు లింకేజీ లభించే విధంగా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. మరిన్ని ఎస్.హెచ్.జి గ్రూప్ ల ఏర్పాటుకు ముందుకు రావాలన్నారు. ట్రాన్స్ జెండర్ కమ్యూనిటీ అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం గొప్ప నిర్ణయం తీసుకుందన్నారు. జీహెచ్ఎంసీలోని వివిధ విభాగాల్లో పలు ఉద్యోగ అవకాశాలు ఉన్నాయన్నారు. అదేవిధంగా వివిధ ఎన్.జీ.ఓ ల ద్వారా పలు రంగాల్లో శిక్షణనిచ్చి స్వయం ఉపాధికి చేయుతనివ్వనున్నట్లు తెలిపారు. సెక్యూరిటీ గార్డ్స్, క్లీన్ డ్రైవ్ అమలులో గ్రీన్ మార్షల్స్, పార్కులు, హెచ్.ఎం.డబ్ల్యూ.ఎస్ అండ్ ఎస్.బి రిజర్వాయర్ల వద్ద, స్పోర్ట్స్ గ్రౌండ్స్ వద్ద సెక్యూరిటీ గార్డ్ లుగా, మెట్రో స్టేషన్ లో ఉద్యోగ అవకాశాలు, అమృత్ స్కీం కింద నీటి నాణ్యత పరీక్షలో సహకారం, శిక్షణ అనంతరం స్ట్రీట్ లైట్ల నిర్వహణ, బస్తీ దవాఖానాలలో ప్యారా మెడికల్ గా ఉపాధి పొందే అవకాశం ఉందని, అర్హత గల వారందరిని భర్తీ చేస్తామన్నారు. స్పోర్ట్స్ అడిషనల్ కమిషనర్ యాదగిరి రావు మాట్లాడుతూ... స్పోర్ట్స్ విభాగంలో ఎలాంటి విద్యార్హత లేని అభ్యర్థుల నుండి అత్యధిక విద్యార్హతలు ఉన్న వారి వరకు పలు రకాల ఉపాధి అవకాశాలు ఉన్నాయని, ఆయా వివరాలను వివరించారు. సమావాశానికి హాజరైన ట్రాన్స్ జెండర్ ఎన్.జి.ఓ లు పలువురు ఈ సందర్భంగా స్కిల్ డెవలప్మెంట్ సెంటర్ల ద్వారా అందిస్తున్న శిక్షణలను వారికి వివరించారు. ఆయా శిక్షణ సంస్థలు ఇస్తున్న ట్రైనింగ్స్, మార్కెట్ లింకేజి తదితర విషయాలను వివరించారు. పలువురు ట్రాన్స్ జెండర్ ల ప్రతినిధులు వారి వారి అభిప్రాయాలను తెలియజేయడంతో పాటు ఉద్యోగ ఉపాధి తో జీవనోపాధికి సంబంధించిన వివిధ అంశాల పై గల సందేహాలను నివృత్తి చేసుకున్నారు. ఈ సమావేశంలో అడిషనల్ ఎస్.పి శ్రీనివాస్, హార్టికల్చర్ ఆఫీసర్ డా. సునంద, అడ్మినిస్ట్రేషన్ జె.సి శ్రీనివాస్, ఎన్.జి.ఓ లు, వివిద ట్రాన్స్ జెండర్స్ అసోసియేషన్స్ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# శ్రీ రామచంద్ర డిగ్రీ కళాశాలకు కొత్త కోర్సులు

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, మే 14(సమయం న్యూస్): కొత్తగూడెం పట్టణంలోని శ్రీరామచంద్ర ప్రభుత్వ ఆర్ట్స్ సైన్స్ డిగ్రీ కళాశాలలో ఈ విద్యా సంవత్సరం నుండి ఉన్నత విద్య పరంగా ఉద్యోగ అవకాశాల పరంగా ఎంతగానో ఉపయోగపడే కొత్త కోర్సులు అందుబాటులోకి వస్తున్నాయని కళాశాల ఇన్ ఛార్జ్ ప్రిన్సిపల్ డాక్టర్ ఎం.పూర్ణచంద్రరావు బుధవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో తెలిపారు. కళాశాలలో ప్రస్తుతం ఉన్న బిఏ, బి.ఎస్ సి, బికాం కోర్సులకు అదనంగా నూతనంగా బి.ఎస్ సి, డైరీ సైన్స్, బి.ఎస్ సి డేటా సైన్స్ కోర్సులు అందుబాటులోకి వచ్చాయన్నారు. వీటితోపాటు ఏఈడిపి కోర్సులలో భాగంగా బికాం ఈ కామర్స్ బి.ఎస్ సి డిజిటల్ ఎలక్ట్రానిక్స్ ఉన్నాయని తెలిపారు. ఏఈడిపి కోర్సులలో చదువుతో పాటు ప్రభుత్వమే విద్యార్థులకు అవసరమైన



శిక్షణ ఇచ్చి ప్రతి నెలా కొంత జీతాన్ని కూడా ఇస్తుందని చదువు పూర్తయిన తర్వాత విద్యార్థినీ విద్యార్థులు ఉద్యోగ జీవితంలో సెటిల్ అయ్యేవరకు తోడ్పాటునిస్తుందని తెలిపారు. ఇంటర్మీడియట్ పాస్ అయిన విద్యార్థినీ విద్యార్థులు వారి భవిష్యత్తుకు ఎంతో ప్రయోజనకరమైన ఈ సదవకాశాన్ని వినియోగించుకొని కొత్త కోర్సుల ద్వారా ప్రయోజనాన్ని పొందాలని కళాశాల ఇన్ ఛార్జ్ ప్రిన్సిపల్ డాక్టర్ ఎం.పూర్ణచంద్రరావు పేర్కొన్నారు.

# పది ఫలితాల్లో వెల్దుర్తి ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల ప్రభంజనం

* **ప్రతిభ చూపిన విద్యార్థులకు ప్రశంసలు**
* **జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్**
* **మెదక్ ఎంపీ రఘునందన్**
* **జిల్లా విద్యాధికారి రాధాకృష్ణ**

వెల్దుర్తి మే 14 సమయం న్యూస్: 2025 విద్యా సంవత్సరంలో పదో తరగతి పరీక్ష ఫలితాల్లో వెల్దుర్తి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు అత్యుత్తమ ప్రదర్శన చూపినందుకు మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్,మెదక్ ఎంపీ రఘునందన్ మరియు జిల్లా విద్యాశాఖ అధికారి రాధా కిషన్ హర్షం వ్యక్తం చేశారు. బుధవారం మెదక్ కలెక్టర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులను వారు హృదయపూర్వకంగా అభినందించారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నుండి గుంటుకు భావన(564 మార్కులు), హనుమాద్రి చంద్ర వర్ధన్ గౌడ్(553 మార్కులు), జగ్గా శ్రీ చరణ్(551 మార్కులు), హనుమాద్రి పావని(550 మార్కులు) విద్యార్థిని విద్యార్థులను వారు సన్మానించడం జరిగింది. అనంతరం వారు మాట్లాడుతూ, తక్కువ మార్కులు వచ్చిన విద్యార్థులు నిరాశ పడకూడదని, ఇది ఓ దశ మాత్రమేనని, ప్రయత్నాలు కొనసాగిస్తే విజయం తప్పదని అలాగే ఫెయిల్ అయిన విద్యార్థులను త్వరలో నిర్వహించే పరీక్షకు సన్నద్ధం చేయాలని అందుకు సరైన చర్యలు చేపట్టాలని సూచించారు. మండల స్థాయిలో 550 మరియు 550 మార్కుల కంటే ఎక్కువగా వచ్చినటువంటి నలుగురు విద్యార్థులు మా పాఠశాలలకే చెందడం సంతోషదాయకమని పాఠశాల ప్రధానోపాధ్యాయులు సాంబయ్య



తెలియజేశారు. విద్యార్థులు ఉన్నత స్థాయికి ఎదిగి మంచి పేరు తీసుకుని రావాలని మండల విద్యాధికారి యాదగిరి సూచించారు.అనంతరం అత్యుత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను శాలువాతో ఘనంగా సన్మానించి ప్రశంస పత్రాలను అందజేశారు.ఈ కార్యక్రమంలో ఎస్. శ్రీనివాసరావు వ్యాయామ ఉపాధ్యాయులు మరియు కే. అర్చన తెలుగు ఉపాధ్యాయురాలు పాల్గొన్నారు.



# మహిళల సేవలు వెలకట్టలేనివి

* **జిల్లా సంక్షేమ అధికారి లెనినా**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, మే 14(సమయం న్యూస్): గృహిణిగా ఉద్యోగినులుగా మహిళల సేవలు వెలకట్టలేనివని జిల్లా సంక్షేమ అధికారి స్వర్ణలత లెనినా అన్నారు. బుధవారం లక్ష్మీదేవిపల్లి మండలం ప్రశాంతి నగర్ అంగన్వాడీ కేంద్రంలో ఇటీవల పదవీ విరమణ చేసిన సీడీపీఓ కనకదుర్గ, హెడ్ మాస్టర్ మేకల జ్యోతి రాణి, రేగళ్ళ అంగన్వాడీ టీచర్ రమాదేవిలకు ఐసిడిఎస్ లక్ష్మీదేవిపల్లి సెక్టార్1 ఆధ్వర్యంలో ఘనంగా వీడ్కోలు సన్మానం జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న స్వర్ణలత లెనినా మాట్లాడుతూ పదవీ విరమణ చేసిసన్మానం పొందిన ముగ్గురు మహిళా ఉద్యోగుల సేవలు సమాజంలో ప్రతి ఒక్కరికి స్ఫూర్తిగా నిలుస్తాయి అన్నారు. జిల్లాలోని అన్ని అంగన్వాడీ కేంద్రాలకు జిల్లా కలెక్టర్ జితేష్ పాటిల్ ప్రత్యేక చొరవ తీసుకుని కొత్త కరెంట్ మీటర్లు వైరింగ్ లైట్లు ఫ్యాన్లతో కూడిన విద్యుత్ సౌకర్యం కల్పిస్తున్నారని చెప్పారు. పాల్వంచ సీడీపీఓ లక్ష్మీ ప్రసన్న గౌరవ అతిథిగా పాల్గొన్నారు. సూపర్ వైజర్ రమాదేవి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్ పద్మ వందన సమర్పణ చేశారు. అంగన్వాడీ టీచర్ లు, ఆయాలు, సిబ్బంది, సన్మాన గ్రహీతల కుటుంబసభ్యులు పాల్గొన్నారు.

# ఇంటర్మీడియట్ విద్యా వ్యవస్థను మరింత బలోపేతం చేయాలి

* **జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్**

మంచిర్యాల జిల్లా ప్రతినిధి, మే 14 సమయం న్యూస్: జిల్లాలో ఇంటర్మీడియట్ విద్యా వ్యవస్థను మరింత బలోపేతం చేయాలని, వార్షిక ఫలితాలలో జిల్లాను రాష్ట్రంలో ముందంజలో ఉంచాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ తెలిపారు. బుధవారం జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలోని కలెక్టర్ సమావేశ మందిరంలో జిల్లా అధికారులతో ఇంటర్మీడియట్ విద్యపై సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలో ఇంటర్మీడియట్ విద్యను మరింత బలోపేతం చేసే దిశగా అధికారులు సమన్వయంతో కృషి చేయాలని తెలిపారు. ఎస్ఎస్సి ఉత్తీర్ణులైన తరువాత విద్యార్థులకు సరైన మార్గదర్శకం చేయాలని, విద్యార్థుల ఆసక్తికి అనుగుణంగా ఇంటర్మీడియట్, ఐటిఐ ఇతర రంగాలలో రాణించే విధంగా ప్రోత్సహించాలని తెలిపారు. జూనియర్ కళాశాలలతో పాటు ఐటిఐలో అడ్వాన్స్డ్ టెక్నాలజీ సెంటర్ల ద్వారా విద్యార్థులకు



నాణ్యమైన విద్యాబోధన అందించాలని, కళాశాలలలో విద్యార్థుల హాజరు శాతం పెంపొందించాలని తెలిపారు. జిల్లాలోని కోటపల్లి, జైపూర్, దండేపల్లి, తాండూర్ మండలాలలో నూతన వసతి గృహాలు మంజూరు అయ్యాయని, జిల్లాలో విద్యార్థులు కళాశాలల్లో చేర్పించేందుకు సంబంధిత అధికారులు, అధ్యాపకుల బృందం సమిష్టిగా కృషి చేయాలని తెలిపారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలల విద్యార్థులకు కళాశాలల సమయాలకు అనుగుణంగా బస్సులు నడిపించాలని తెలిపారు. జిల్లాలో ఇంటర్మీడియట్ వార్షిక ఫలితాలు 2025లో 11 వేల 767 మంది విద్యార్థినీ, విద్యార్థులు పరీక్షలకు హాజరు కాగా, 62.43 శాతంతో 7 వేల 347 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారని, గత ఫలితాలతో పోల్చితే ఉత్తీర్ణత శాతం మెరుగుపడిందని, వచ్చే సప్లమెంటరీ పరీక్షలకు మరింత ఉత్తీర్ణత సాధించేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. జిల్లాలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలలో 202425 విద్యా సంవత్సరానికి గాను ఇంటర్ ప్రథమ సంవత్సరంలో 2 వేల 22 మంది, ద్వితీయ సంవత్సరంలో 1 వేయి 980 మంది విద్యార్థులు విద్య అభ్యసిస్తున్నారని, 202526 సంవత్సరంలో అదనంగా 30 శాతం విద్యార్థుల సంఖ్యను పెంపొందించాలని తెలిపారు. ఇందులో భాగంగా జూనియర్ లెక్చరర్లతో బృందాలు ఏర్పాటు చేసి వారి పరిధిలోని పాఠశాలలలో 10వ తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులకు అవగాహన కల్పించి కళాశాలలో చేర్పించాలని తెలిపారు. సుప్రీంకోర్టు నిబంధనల ప్రకారం అన్ని జూనియర్ కళాశాలలు 202526 సంవత్సరంలో మున్సిపల్ కార్పొరేషన్, మున్సిపాలిటీ, గ్రామపంచాయతీ లచే జారీ చేయబడిన ఫైర్ సేఫ్టీ, సానిటరీ సర్టిఫికెట్, స్ట్రక్చరల్ సేఫ్టీ,సౌండ్నెస్ సర్టిఫికెట్ కలిగి ఉండాలని తెలిపారు. జిల్లాలోని మంచిర్యాల, మందమర్రి, కాసిపేట, చెన్నూరు, బెల్లంపల్లి (బాలుర, బాలికల), జైపూర్, జన్నారం, దండేపల్లి, లక్షెట్టిపేట లలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 1 లక్షా 77 వేల రూపాయల వ్యయంతో 95 అగ్ని నిరోధక వ్యవస్థలను ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. వసతి గృహాల ఏర్పాటుకు సంబంధిత అధికారులు ప్రతిపాదనలు అందించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.



# ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

* **ట్రాఫిక్ ఏసీపీ మస్తాన్ అలీ సూచన**

బోధన్ పట్టణం, మే 14, సమయం న్యూస్ : ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నియమాలు తప్పకుండా పాటించాల్సిన అవసరం ఉందని ట్రాఫిక్ ఏసీపీ మస్తాన్ అలీ తెలిపారు. నిజామాబాద్ జిల్లా బోధన్ పట్టణంలోని కొత్త బస్టాండ్ ప్రాంగణంలో ఆటో డ్రైవర్లకు రోడ్లపై ట్రాఫిక్ నియమాల పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆటోలలో అధిక సంఖ్యలో ప్రయాణికులను రవాణా చేయడం ప్రమాదకరమని హెచ్చరించారు. పరిమితికి మించి ప్యాసింజర్లను తీసుకెళ్లొద్దని, అదనపు సీట్లు తొలగించాలని సూచించారు. ఇంకా, మైనర్లకు వాహనాలు ఇవ్వడం నేరమని తల్లిదండ్రులు జాగ్రత్త వహించాలని సూచించారు. ట్రాఫిక్ నిబంధనలను పాటించడం ద్వారా రోడ్డు ప్రమాదాలను తగ్గించవచ్చని అన్నారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ సీఐ చందర్ రాథోడ్, పట్టణ సీఐ వెంకటనారాయణ పాల్గొన్నారు. ట్రాఫిక్ భద్రతపై ప్రజల్లో అవగాహన పెంపొందించాలన్నదే ప్రధాన ఉద్దేశ్యమని అధికారులు పేర్కొన్నారు.

# అంబర్ పేట నియోజకవర్గంలో పలు వివాహాలకు హాజరైన ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్

అంబర్ పేట,మే,14(సమయం న్యూస్): అంబర్ పేట నియోజకవర్గంలో వివిధ కళ్యాణ మండపాల్లో జరిగిన వివాహ వేడుకలకు అంబర్ పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ హాజరయ్యారు. అంబర్ పేట ప్రేమనగర్ కు చెందిన దాలే రాధిక, శ్రీనివాస్ ల కుమార్తె విష్ణు ప్రియ, నవీన్ కుమార్ వధు వరుల వివాహానికి హాజరై నూతన దంపతులను ఆశీర్వదించారు. ఈ వివాహ వేడుకలో బిఆర్ఎస్ సీనియర్ నాయకులు లవంగు ఆంజనేయులు, దాత్రిక ధర్మరాజు, శ్రీనివాస్ గౌడ్, డి .గంగరాజు వారే బాలకృష్ణ, వంజరి నాగరాజు, దత్రిక కాళిదాసు, ఓ. వెంకటేష్, మనోజ్ యాదవ్,జగత్ సింగ్, దరుకు నరేష్ ,దలె శ్రీనివాస్, దలే రమేష్ తదితరులు పాల్గొన్నారు.



గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ గద్వాల విజయ లక్ష్మీ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారి నీ మర్యాద పూర్వకంగా తెలంగాణ సెక్రటేరియట్ లో బుధవారం సాయంత్రం కలిశారు. ముఖ్యమంత్రి గారు ఇచ్చిన హామీ మేరకు జి హెచ్ ఎం సి నిధులు మంజూరు చేసినందుకు మేయర్ ధన్యవాదాలు తెలిపారు. జి హెచ్ ఎం సి అభివృద్ధి పై సమీక్ష నిర్వహించాలని ఈ సందర్భంగా మేయర్ సి ఎం ను కోరారు..





## అంగరంగ వైభవంగా శ్రీ సీతారామచంద్రస్వామి విగ్రహ ప్రతిష్ట మహోత్సవం

గుమ్మడిదల, మే14, సమయం న్యూస్ : అంగరంగ వైభవంగా శ్రీ సీతారామచంద్రస్వామి విగ్రహ ప్రతిష్ట మహోత్సవం బుధవారం గుమ్మడిదల మున్సిపాలిటీ పరిధిలోని దోమడుగు గ్రామంలో జరిగింది. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో ఎంతో ఉత్సాహంగా పాల్గొన్నారు. ఆలయంలో లక్ష్మణ ఆంజనేయ సమేత సీతారామచంద్ర స్వామి విగ్రహ ప్రతిష్ట ,ధ్వజస్తంభం ప్రతిస్థాపన కార్యక్రమం కనుల పండుగగా సాగింది. గ్రామంలోని కొందరు యువకులు శ్రీరామ దీక్ష తీసుకొని సేవ చేయడం విశేషం. విగ్రహ ప్రతిష్ట అనంతరం అన్నప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సీజేఆర్ ట్రస్ట్ చైర్మన్ చిమ్మల గోవర్ధన్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ఆలయ నిర్మాణాలు ఆధ్యాత్మిక శోభను పెంచుతాయని, శాంతి, సామరస్య వాతావరణాన్ని పెంపొందిస్తాయని అన్నారు. ఆలయ అభివృద్ధికి తన వంతు సహాయ సహకారాన్ని అందించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచులు రాజశేఖర్ రెడ్డి ,శ్రీనివాస్ రెడ్డి, వేణు, మాజీ ఎంపిటిసి గోవర్ధన్ రెడ్డి, నాగేందర్ గౌడ్, నాయకులు, భక్తులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# అర్హత లేని వ్యక్తులు వైద్యసేవలు చేస్తే క్రిమినల్ చర్యలు

* ఆపిల్ స్కాన్ సెంటర్, శరత్ కార్డియాక్ సెంటర్ మూసివేత....
* సాయి గణేష్,శ్రీ కృష్ణ హాస్పిటల్స్ పై కమిటీ విచారణ ..
* ప్రైవేట్ హాస్పిటల్ లను ప్రక్షాళన చేసేందుకు 3 బృంధాలు ఏర్పాటు..
* వైద్య వృత్తి సమాజంలో గౌరవ ప్రధమైనది....
* జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్



సూర్యాపేట మే14(సమయం న్యూస్) : అర్హత లేని వైద్యులు చికిత్స చేసి ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడితే క్రిమినల్ చర్యలు తీసుకోవటం జరుగుతుందని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ హెచ్చరించారు. మంగళవారం కలెక్టర్ ఛాంబర్ లో జిల్లా అదనపు కలెక్టర్ పి రాంబాబు తో కలిసి జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ జిల్లాలోని వైద్య ఆరోగ్య శాఖ, టి జి యం సి, ఐ యమ్ ఎ ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజల ప్రాణాలను కాపాడే వైద్య వృత్తిపై సమాజం లో గౌరవం ఉన్నదని అట్టి వైద్య వృత్తి పై ప్రజలు నమ్మకం కోల్పోకుండా వైద్యులు భాద్యతగా ఉండాలి అని తెలిపారు. అర్హత లేని వ్యక్తులు వైద్యులుగా వ్యవహారిస్తూ నకిలీ డిగ్రీ లతో క్షేత్ర స్థాయి లో చికిత్స లు అందిస్తు ప్రజల ఆరోగ్యాన్ని ప్రమాదం లోకి నేడుతున్న వైద్యులని ఉపేక్షించేది లేదని ఐపీసి ప్రకారం క్రిమినల్ కేసు లు నమోదు చేస్తామని తెలిపారు. డి యం అండ్ హెచ్ ఓ అలాగే ఐ యం ఏ ప్రతినిధులు 3 బృంధాలుగా ఏర్పడి క్లినికల్ ఎస్టాబ్లిష్ మెంట్ యాక్ట్, పి సి పి యన్ డి టి యాక్ట్ లలోని నిబంధనల ప్రకారం జిల్లాలోని ప్రతి హాస్పిటల్ ని, డయాగ్నస్టిక్ సెంటర్లని పరిశీలించి అర్హత లేని డాక్టర్లను, ల్యాబ్ టెక్నీషియన్స్ లను ,రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్ లేని డాక్టర్లను,ఒక హాస్పిటల్ లో అనుమతి తీసుకొని మరో హాస్పిటల్ లో పని చేసే వారిని గుర్తించి వారికి నోటీసులు ఇచ్చి విచారించాలని తెలిపారు. విచారణలో తప్పు అని రుజువైతే అట్టి వారిపై కఠిన చర్యలు తీసుకోవటం జరుగుతుందని హెచ్చరించారు. అనుమతి తీసుకునేటప్పుడు ఉన్న డాక్టర్ ప్రస్తుతం లేకపోతే కొత్త డాక్టర్ వివరాలను సమర్పించాలని హాస్పిటల్ యజమాన్యానికి నోటీసులు ఇవ్వాలని ఆదేశించారు.హాస్పిటల్ లో ప్రైమరీ డాక్టర్ ఉంటేనే కన్సల్టెన్సీ డాక్టర్ కి అనుమతి ఇవ్వాలని అలాగే కన్సల్టెన్సీ డాక్టర్ లు ఎన్ని రోజులు ఏఏ సమయాలలో హాస్పిటల్ ని సందర్శిస్తారో అట్టి వివరాలను తెలియజేయాలనీ హాస్పిటల్స్ యాజమాన్యానికి సూచించారు. మల్టీ స్పెషాల్టీ హాస్పిటల్ లో అర్హత ఉన్న డాక్టర్లు, స్తాఫ్ నర్సులు, ల్యాబ్ టెక్నీషియన్స్ ఉన్నారో లేరో పరిశీలించి నోటీసులు ఇచ్చి లేకపోతే హాస్పిటల్ పడకల సామర్థ్యము తగ్గించాలని డి యం హెచ్ ఓ కి సూచించారు.ప్రతి రోజు 3 బృందాలు పరిశీలించిన హాస్పిటల్ వివరాలు డి యం హెచ్ ఓ తెలియజేయాలనీ, అలాగే ప్రతి వారం వైద్య ప్రతినిధులతో సమావేశం నిర్వహిస్తానని ఈ సందర్భంగా కలెక్టర్ తెలిపారు. ఈ సమావేశంలో డి యం హెచ్ ఓ డాక్టర్ కోటాచలం, డిప్యూటీ డి యం హెచ్ ఓ లు డాక్టర్ చంద్రశేఖర్, డాక్టర్ జయ మనోహరి, పి యం హెచ్ యన్ డాక్టర్ అనితరాణి ఐ యం ఏ ప్రతినిధులు డాక్టర్ దయాకర్ రెడ్డి, డాక్టర్ రమేష్, డాక్టర్ ఆనంద్ గాంబ్లె, డాక్టర్ శ్రీరామ్, డాక్టర్ అనూష, టి జి యం సి సభ్యులు రాజీవ్ నాయక్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.



## యాప్రాల్ మెహర్ బాబా కాలనీ రోడ్డును పరిశీలించిన హైడ్రా, జీహెచ్ఎంసీ అధికారులు

కాప్రా,మే 14, (సమయం న్యూస్) : మల్కాజిగిరి సర్కిల్ నేరేడ్మేట్ డివిజన్ పరిధిలోని మెహర్ బాబా కాలనీలోని రోడ్డును అక్రమించి చేపట్టిన నిర్మాణాన్ని బుధవారం హైడ్రా, మున్సిపల్ అధికారులు పరిశీలించారు. కాలనీలో ప్రజలకు చెందిన రహదారిపై పునరావృతంగా జరుగుతున్న ఆక్రమణలపై ప్లాట్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. ఈ ఆక్రమణలకు కేంద్ర బిందువుగా ఉన్నది మహారాష్ట్ర ప్రభుత్వంలో డైరెక్టర్ జనరల్, మైన్స్ అండ్ జియాలజీగా పనిచేస్తున్న టీఆర్కే రావు అని ప్లాట్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కార్యదర్శి భాస్కర్ రెడ్డి, అధ్యక్షుడు కృష్ణమూర్తి ఆరోపించారు. ఆయన తోపాటు గోమునేంద్ర ట్రస్టు సభ్యులు కూడా ఇందులో భాగమైనట్లు పేర్కొన్నారు. నివాసితుల ఫిర్యాదులపై జీహెచ్ఎంసీ అధికారులు గత ఏడాది ఆగస్టు 21న, 2025 జనవరి 21న ఇక్కడి రోడ్డుపై వెలిసి అక్రమ నిర్మాణాలను తొలగించారనీ, కొద్ది రోజులకే తిరిగి అక్రమ నిర్మాణాలు ప్రారంభమయ్యాయని తెలిపారు. అధికారులు స్పందించి వెంటనే పరిశీలించి కఠిన చర్యలు తీసుకుంటామని వారు తెలిపారు

# పారదర్శకంగా యువ వికాసం అర్హుల జాబితా ఎంపిక

* జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష
* కాల్వల రిన్నోవేషన్ పనులను గుర్తించి ప్రతిపాదనలు అందించాలి
* రాజీవ్ యువ వికాసం, నీటి పారుదల శాఖ కాల్వల రిన్నోవేషన్ పై సంబంధిత అధికారులతో రివ్యూ నిర్వహించిన జిల్లా కలెక్టర్



పెద్దపల్లి, మే 14:( సమయం న్యూస్) : రాజీవ్ యువ వికాసం కోసం పథకం క్రింద అర్హుల జాబితా ఎంపిక ప్రక్రియ పూర్తి పారదర్శకంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష అన్నారు. బుధవారం సమీకృత జిల్లా కలెక్టరేట్ లో రాజీవ్ యువ వికాసం, నీటి పారుదల శాఖ కాల్వల రిన్నోవేషన్ పై సంబంధిత అధికారులతో జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష రివ్యూ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ, రాజీవ్ యువ వికాసం పథకం క్రింద స్వయం ఉపాధి యూనిట్ల స్థాపనకు అర్హులైన దరఖాస్తుల వివరాలను బ్యాంకర్లు వెంటనే సంబంధిత ఎంపీడీఓ లకు అందజేయాలని కలెక్టర్ సూచించారు. బ్యాంకర్లు అందించిన జాబితాను ఎంపిడిఓ పరిశీలించి గత ఐదు సంవత్సరాలలో కార్పొరేషన్ ద్వారా ఇతర రుణాలు, యూనిట్లు ఏమైనా పొందు ఉన్నారా, ప్రభుత్వ నిబంధనల ప్రకారం అర్హత ఉందో పరిశీలించి తుది అర్హుల జాబితాను పారదర్శకంగా ఎంపిక చేసి ఎమ్మెల్యేలకు త్వరితగతిన రిపోర్ట్ అందించాలని కలెక్టర్ సూచించారు. జిల్లాలోనీ వివిధ సాగునీటి ప్రాజెక్టుల కింద ఉన్న కాల్వల రిన్నోవేషన్, కాల్వలలో ఉన్న పిచ్చి మొక్కలు,చెత్త తొలగింపు, అక్కడక్కడ మరమ్మత్తు పనులను గుర్తించి ఉపాధి హామీ పథకం కింద చేపట్టేందుకు ప్రతిపాదనలు తయారు చేసి సమర్పించాలని కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి ఎం.కాళిందిని, జడ్పీ సీఈఓ నరేందర్, లీడ్ బ్యాంకు మేనేజర్ వెంకటేష్, జిల్లా బీసీ అభివృద్ధి అధికారి రంగారెడ్డి, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.




## రామప్ప ఆలయానికి చేరుకున్న ప్రపంచ సుందరిమణులు

* అపూర్వ ఘన స్వాగతం
* గుస్సాడీ నృత్య ప్రదర్శనలతో కళాకారుల స్వాగతం

వెంకా1టాపురం మే 14 ( సమయం న్యూస్) : ములుగు జిల్లా రామ పాలయానికి ప్రపంచ సుందరిమణులు చేరుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దివాకర ఎస్పీ శబరిష జిల్లా అధికారులు టూరిజం శాఖ అధికారులు ప్రపంచ సుందరి మహిళలకు ఘన స్వాగతం పలికారు. గుస్సాడీ నృత్య ప్రదర్శన ఒగ్గుడోలు ప్రదర్శన ద్వారా కళాకారులు ఆత్మీయ స్వాగతం పలికారు. అనంతరం దేవాలయంలోకి చేరుకున్న సుందరిమణులు ఎవరికి వారే స్వయంగా కాళ్లు కడుక్కొని పూజలు చేసేందుకు ఆలయంలోకి వెళ్లారు. ఈ సందర్భంగా ఆలయ అధికారులు సిబ్బంది వారికి ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ విశిష్టత చరిత్ర ఆలయ సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. పురాతన ఆలయం రామప్ప ఆలయాన్ని తిలకించి మంత్రముగ్ధులయ్యారు. ఆలయ తీరుతన్నులను తనివి తీర తిలకించి ఫిదా అయ్యారు.

# ఎంబిసి, డిఎన్టి ల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలి



మంచిర్యాల జిల్లా ప్రతినిధి, మే 14 సమయం న్యూస్: ఎంబిసి, డిఎన్టి ల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని జాతీయ బిసి హక్కుల పోరాట సమితి నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు బుధవారం సంఘం ఆధ్వర్యంలో జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత కలెక్టరేట్ కార్యాలయంలో కార్యాలయ ఏవో రాజేశ్వర్ కు వినతి పత్రం అందజేశారు. అనంతరం సంఘం జిల్లా అధ్యక్షులు గుమ్ముల శ్రీనివాస్ మాట్లాడుతూ, సంచార కులాలకు అనగా డిఎన్టి లకు శాశ్వత కమిషన్ ఏర్పాటు చేయాలని, రాజ్యాంగంలోని మూడవ షెడ్యూల్లో సంచార కులాలను చేర్చాలని, బీసీ, ఎంబిసి లకు వేర్వేరు కమిషన్లు ఏర్పాటు చేయాలని, ఎంబీసీ, డిఎన్టి ల స్థితిగతులపై బీసీ కమిషన్ చే అధ్యయనం చేయించి, అందుకు అనుగుణంగా వారి అభివృద్ధికై త్వరితగతిన చర్యలు తీసుకోవాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం ఎంబిసి మంత్రిత్వ శాఖను ప్రత్యేకంగా ఏర్పాటు చేయాలని, అలాగే డిఎన్టి లకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని, దేశవ్యాప్తంగా స్థానిక సంస్థల రిజర్వేషన్లను ఏబిసిడి గ్రూపులుగా వర్గీకరించాలని, దీనితో సంచార జాతర కులాలకు స్థానిక సంస్థలలో అవకాశాలు మెరుగుపడతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంచార జాతర సంక్షేమ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు వైద్య భాస్కర్, తెలంగాణ గంగాపుత్రుల సంఘం జిల్లా అధ్యక్షులు నెన్నెల నరసయ్య, జాతీయ విద్యార్థి సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చేరాల వంశీ, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు తాళ్ల హరీష్ గౌడ్, బిసి నాయకులు శాఖపూరి భీమ్ సేన్ , శ్రీపతి రాములు, వేముల కిరణ్ లు పాల్గొన్నారు.

# ట్రాన్స్ జెండర్ లకు గౌరవమైన జీవన భృతి కల్పించేందుకు ప్రభుత్వం కృషి

హైదరాబాద్, మే 14: సమాజంలో ట్రాన్స్ జెండర్ లకు గౌరవమైన జీవన భృతి కల్పించే దిశగా రాష్ట్ర ప్రభుత్వం అడుగులు వేస్తోందని అడిషనల్ కమిషనర్లు స్నేహ శబరీష్, చంద్ర కాంత్ రెడ్డిలు అన్నారు. బుధవారం జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలోని పన్వర్ హాల్ లో ట్రాన్స్ జెండర్ ల ప్రతినిధులు, ఎన్.జి.ఓ లతో యు.సి.డి విభాగం ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ట్రాన్స్ జెండర్ ల సేవలను జీహెచ్ఎంసీలోని వివిధ విభాగాలలో వినియోగించే అంశంపై వారి సూచనలు, అభిప్రాయాలను తీసుకున్నారు. ఈ సందర్భంగా అడిషనల్ కమిషనర్ స్నేహ శబరీష్ మాట్లాడుతూ... ట్రాన్స్ జెండర్ ల ఆసక్తి, అర్హతల మేరకు జీహెచ్ఎంసీలో ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించడానికి చేపట్టే చర్యల్లో భాగంగా ఈ సమావేశం ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. జీహెచ్ఎంసీలో మాత్రమే కాకుండా ఇతర విధాల




ఉపాధి పొందడానికి వారికి శిక్షణలు కూడా ఇస్తారని తెలిపారు. యు.సి.డి అడిషనల్ కమిషనర్ చంద్రకాంత్ రెడ్డి మాట్లాడుతూ... గౌ ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు జీహెచ్ఎంసీలో పలు ఉద్యోగ అవకాశాలు, ట్రాన్స్ జెండర్ వినియోగించుకొని ఆర్థికంగా నిలదొక్కుకోవాలన్నదే ముఖ్యమంత్రి నిర్ణయమని, అందుకు తమ తమ విద్యా అర్హతలు, నైపుణ్యత, ఆసక్తుల మేరకు అనువైన రంగాన్ని ఎంచుకోవాలని, దానికి తగ్గట్టుగా శిక్షణ ఇచ్చి ఉపాధి కల్పించడానికి చర్యలు తీసుకోనున్నట్లు వివరించారు. ఉద్యోగ అవకాశాలు కు అర్హత లేని ట్రాన్స్ జెండర్లను స్వయం సహాయక గ్రూపులు ఏర్పాటు చేసి ఆర్థిక ఎదుగుదలకు దోహద పడే విధంగా కూడా జిహెచ్ఎంసి కృషి చేస్తుందన్నారు ఇప్పటికే మూడు ట్రాన్స్ జెండర్ ల ఎస్.హెచ్.జి గ్రూపులను ఏర్పాటు చేసి బ్యాంకు లింకేజీ లభించే విధంగా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. మరిన్ని ఎస్.హెచ్.జి గ్రూప్ ల ఏర్పాటుకు ముందుకు రావాలన్నారు. ట్రాన్స్ జెండర్ కమ్యూనిటీ అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం గొప్ప నిర్ణయం తీసుకుందన్నారు. జీహెచ్ఎంసీలోని వివిధ విభాగాల్లో పలు ఉద్యోగ అవకాశాలు ఉన్నాయన్నారు. అదేవిధంగా వివిధ ఎన్.జీ.ఓ ల ద్వారా పలు రంగాల్లో శిక్షణనిచ్చి స్వయం ఉపాధికి చేయుతనివ్వనున్నట్లు తెలిపారు. సెక్యూరిటీ గార్డ్స్, క్లీన్ డ్రైవ్ అమలులో గ్రీన్ మార్షల్స్, పార్కులు, హెచ్.ఎం.డబ్లూ.ఎస్ అండ్ ఎస్.బి రిజర్వాయర్ల వద్ద, స్పోర్ట్స్ గ్రౌండ్స్ వద్ద సెక్యూరిటీ గార్డ్ లుగా, మెట్రో స్టేషన్ లో ఉద్యోగ అవకాశాలు, అమృత్ స్కీం కింద నీటి నాణ్యత పరీక్షలో సహకారం, శిక్షణ అనంతరం స్ట్రీట్ లైట్ల నిర్వహణ, బస్తీ దవాఖానాలలో ప్యారా మెడికల్ గా ఉపాధి పొందే అవకాశం ఉందని, అర్హత గల వారందరిని భర్తీ చేస్తామన్నారు. స్పోర్ట్స్ అడిషనల్ కమిషనర్ యాదగిరి రావు మాట్లాడుతూ... స్పోర్ట్స్ విభాగంలో ఎలాంటి విద్యార్హత లేని అభ్యర్థుల నుండి అత్యధిక విద్యార్హతలు ఉన్న వారి వరకు పలు రకాల ఉపాధి అవకాశాలు ఉన్నాయని, ఆయా వివరాలను వివరించారు. సమావాశానికి హాజరైన ట్రాన్స్ జెండర్ ఎన్.జి.ఓ లు పలువురు ఈ సందర్భంగా స్కిల్ డెవలప్మెంట్ సెంటర్ల ద్వారా అందిస్తున్న శిక్షణలను వారికి వివరించారు. ఆయా శిక్షణ సంస్థలు ఇస్తున్న ట్రైనింగ్స్, మార్కెట్ లింకేజి తదితర విషయాలను వివరించారు.

# కొనుగోలు కేంద్రంలో సమస్యలు

- ఎండిన ధాన్యాన్ని తూకం వేయడంలో జరుగుతున్న అవకతవకలు
- ధాన్యానికి అధిక తూకం
- హమాలీలు గా మారుతున్న రైతులు
- జిన్నారంలోని ధాన్యం కొనుగోలు కేంద్రంలో సమస్యలు అనేకం
- సమస్యలను పరిష్కరించాలని కోరుతున్న రైతులు









జిన్నారం, మే 14, సమయం న్యూస్; సంగారెడ్డి జిల్లా మండల కేంద్రమైన జిన్నారం లోని ధాన్యం కొనుగోలు కేంద్రంలో సమస్యలు తీవ్రంగా ఉండడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. తూకంలో అవకతవకలు జరుగుతున్నాయని రైతులు ఆరోపిస్తున్నారు. కేంద్రం వద్ద రైతులకు తగిన వసతులు లేకపోవడంతో ఎండ తీవ్రతతో ఇబ్బందులు పడాల్సి వస్తుంది. ధాన్యంకొనుగోలుకేంద్రంవద్దసమస్యలను పరిష్కరించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రంలో అనేక అవస్థలు పడుతున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కేంద్రానికి వచ్చిన రైతులు ధాన్యం ఆరబోసిన తర్వాత తేమ శాతాన్ని చూసి ధాన్యాన్ని సంచులు నింపి తూకం వేయాల్సి ఉండగా, ఇందుకు విరుద్ధంగా తూకం జరుగుతుందని రైతులు ఆరోపిస్తున్నారు. సంచులు నింపేందుకు హమాలీలు అందుబాటులో లేరు. దీంతో రైతులే సంచులు నింపి హమాలీ పని చేయాల్సి వస్తుంది. అలా రైతులే బస్తాలు నింపిన తరువాత తూకం వేయడానికి 3 నుండి 4 రోజుల సమయం పడుతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సమయం వృధా చేయడంతో వర్షాలు పడి నష్టం జరుగుతుందోనని రైతులు ఆందోళన చెందుతున్నారు. వర్షం గానీవస్తే ధాన్యంపై కప్పడానికి కవర్లు కూడా అందుబాటులో లేవు. ఇక తూకం విషయానికి వస్తే 41 కిలోలకు బదులు 42.5 కిలోల ధాన్యం తూకం వేస్తున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. ఈ అధిక తూకం ఎవరి కోసమని రైతులు అధికారులను ప్రశ్నిస్తున్నారు. ఎంతో కష్టపడి పండించిన పంటను అమ్మడానికి వస్తే, ప్రతిష్ఠాత్మకంగా ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రంలో కూడా దళారీ వ్యవస్థ నడుస్తున్నదని రైతులు ఆవేదన చెందుతున్నారు. ఇకనైనా సంబంధిత అధికారులు స్పందించి వెంటనే చర్యలు తీసుకోవాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.

**సంబంధిత అధికారి వివరణ**

ఈ విషయమై సంబంధిత అధికారి ఎపియం నరేందర్ ను ప్రశ్నించగా, ధాన్యాన్ని జల్లెడ ఆడించకుండా తీసుకోవడంతో రైతుల ఆమోదంతోనే 42.5 కిలోల ధాన్యాన్ని తీసుకుంటున్నట్టు తెలిపారు. చివరి రోజులలో దాన్యం కొనుగోలు కేంద్రానికి అధికంగా రావడంతో ఈ సమస్య ఏర్పడిందని, హమాలీల సంఖ్యను పెంచి తగు జాగ్రత్తలు తీసుకుంటామని ఆయన వివరించారు.



## పెద్దమ్మ తల్లి దయతో అందరూ సుభిక్షంగా ఉండాలి

* **దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి**

తొగుట మే 14 (సమయం న్యూస్) మండలం లోని లింగంపేట లో పెద్దమ్మ ఉత్సవాల్లో పాల్గొన్న కొత్త ప్రభాకర్ రెడ్డి పెద్దమ్మ చల్లటి చూపుతో సకాలంలో వర్షాలు కురిసి, పాడిపంటలతో ప్రజలంతా సుభిక్షంగా ఉండాలని అమ్మవారిని వేడుకున్నారు. లింగంపేట లో జరుగుతున్న పెద్దమ్మ ఉత్సవాల్లో భాగంగా జరిగిన పెద్దమ్మ పెద్దిరాజుల కళ్యాణోత్సవం లో రాష్ట్ర ఎస్సీ ఎస్టీ కమీషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య తో కలిసి ఎమ్మెల్యే పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎమ్మెల్యే ను ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. కాగా దివంగత మాజీ ఎమ్మెల్యే సోలిపేట రామలింగారెడ్డి సతీమణి సోలిపేట సుజాతమ్మ పెద్దమ్మ పాల్గొన్నారు. కార్యక్రమం లో మండల బి ఆర్ ఎస్ పార్టీ అధ్యక్షులు జీడిపల్లి రాంరెడ్డి, సొసైటీ వైస్ చైర్మన్ కుర్మ యాదగిరి, నాయకులు చిలివేరి మల్లారెడ్డి, బోధనం కనకయ్య, సుతారి రమేష్, కర్ణాకర్, లక్ష్మీనారాయణ, మల్లేశం అంజయ్య, సొమెందర్, యాదగిరి, రేణయ్య, తదితరులు పాల్గొన్నారు.

## మున్సిపల్ చైర్మన్ పదవే ధ్యేయంగా
# ఐక్యమత్యంగా ఉండి విజయం సాధిద్దాం

* **ఎంఐఎం జిల్లా అధ్యక్షుడు ఫయాజోద్దీన్**



బోధన్ పట్టణం, మే 14, సమయం న్యూస్ : నిజామాబాద్ జిల్లా బోధన్ ఏఐఎంఐఎం (ఆల్ ఇండియా మజ్లిస్ ఏ ఇత్తేహదుల్ ముస్లిమీన్) పార్టీ ఆధ్వర్యంలో నూతనంగా ఎన్నిక కాబడిన పట్టణ ఎంఐఎం పార్టీ అధ్యక్షునికి, కమిటీ సభ్యులకు మంగళవారం రాత్రి పట్టణంలోని ఓ ఫంక్షన్ హాల్ లో అభినందన సన్మాన సభ నిర్వహించడం జరిగింది ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా నిజామాబాద్ జిల్లా ఎంఐఎం అధ్యక్షుడు ఫయాజోద్దీన్, నిజామాబాద్ కార్పొరేషన్ మాజీ డిప్యూటీ మేయర్ మీర్ మజాజ్ అలీ హాజరయ్యారు. జిల్లా అధ్యక్షులు నూతనంగా పట్టణ అధ్యక్షునిగా ఎన్నికైన మీ ఇలియాస్ అలీనీ కమిటీ సభ్యులని శాలువాలను, పూలమాలలను, పుష్ప గుచ్చాలను అందించి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పార్టీ అధిష్టానం, ప్రజల ఆకాంక్ష మేరకు ఈ కమిటీని ఎన్నుకోవడం జరిగిందని, పట్టణంలో పార్టీ బలోపేతం కొరకు ఈ కమిటీ సర్వశక్తుల కృషి చేయాలని, రానున్న బోధన్ మున్సిపల్ ఎన్నికలు 2025 లో 20కి పైగా వార్డులలో విజయం సాధించి ఎటువంటి పొత్తులు లేకుండా చైర్మన్ స్థానాన్ని గెలుచుకుంటాం అనే ధీమా వ్యక్తం చేశారు. అందుకొరకు ప్రతి ఒక్కరు కలిసికట్టుగా, ఐకమత్యంగా ఉండాలని పార్టీ సిద్ధాంతాలను పాటించాలని కోరారు. ఎంఐఎం కేవలం ముస్లిం పార్టీ గా కాకుండా హిందూ, సిక్ తదితర బడుగు బలహీన వర్గాలను, కుల మతాలకు అతీతంగా అందరిని సైతం అక్కున చేర్చుకొని వారికి కౌన్సిలర్ టికెట్లను అందించే క్రమంలో పార్టీ ఉందని అన్నారు. కాబట్టి ఎంఐఎం పార్టీ బోధన్ మున్సిపల్ చైర్మన్ స్థానాన్ని ఖచ్చితంగా కైవసం చేసుకుంటుందని ఆశాభావం వ్యక్తం చేశారు. జిల్లా వ్యాప్తంగా ఎంఐఎం పార్టీని బలోపేతం చేయాలని, ప్రతి కార్యకర్త నిబద్ధతతో పనిచేయాలని సూచించారు. పట్టణ అధ్యక్షులు మీర్ ఇలియాస్ అలీ మాట్లాడుతూ ఎంఐఎం పార్టీ నిర్వాహకులు అసదుద్దీన్ ఓవైసీ, రాష్ట్ర నేత అక్బరుద్దీన్ ఓవైసీ, జిల్లా ఇన్చార్జ్ బలాల, అందరూ తనపై నమ్మకముంచి పట్టణ అధ్యక్షునిగా నియమించినందుకు నూతన కమిటీని ఏర్పాటు చేసినందుకు నమ్మకంతో బాధ్యతను న్యాయంగా నిర్వర్తిస్తామని అన్నారు. "రానున్న మున్సిపల్ ఎన్నికల్లో ప్రతి వార్డులో పోటీ చేస్తూ, ప్రజల ఆశీర్వాదంతో మున్సిపల్ చైర్మన్ పదవిని గెలుస్తాం" తమ ఆశాభావాన్ని తెలిపారు. ప్రజల సమస్యలను తన, కమిటీ దృష్టికి తీసుకువస్తే పరిష్కరించే ప్రయత్నం చేస్తామని, నేటి నుండి ప్రతి ఒక్కరం ప్రజా సమస్యలపై ప్రజాసేవకై ముందుండి నడుస్తామని అన్నారు. పార్టీ భవిష్యత్తుపై నాయకులు తమ అభిప్రాయాలు పంచుకుని, ప్రజల సేవే మా ధ్యేయం పనిచేస్తామని అన్నారు. అనంతరం స్థానిక రెంజల్ బేస్ ప్రాంతంలోని హజ్రత్ సయ్యద్ షాహ జలాలీ బుఖారి దర్గాలో చాదర్ని కప్పి ప్రత్యేక ప్రార్థనలను నిర్వహించి ఆ అల్లా దీవెనలను తీసుకోవడం జరిగింది. అనంతరం విచ్చేసిన అతిధులకు ప్రజల కొరకై పట్టణ అధ్యక్షుని ఇంటిదగ్గర భోజన సదుపాయాన్ని ఏర్పాటు చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో పార్టీ ప్రముఖులు సమీ, లీగల్ అడ్వైజర్ వాజిద్ హుస్సేన్, అహ్మద్ బీన్ హుస్సేన్, ఖదీర్ ఖాన్, ఫారుకి, హాజీ, సమీర్, వలీయూద్దీన్, కలీం, తదితర ప్రముఖులు, మాజీ కౌన్సిలర్లు, పార్టీ శ్రేణులు యువత తదితరులు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.



## తెదేపా బలోపేతానికి కార్యకర్తలు కృషి చేయాలి

**: రాష్ట్ర మాజీ కార్యదర్శి విట్టల్**

బోధన్ డివిజన్, మే 14, సమయం న్యూస్ : తెదేపా బలోపేతం కోసం ప్రతి కార్యకర్త కృషి చేయాలని తెదేపా రాష్ట్ర మాజీ కార్యదర్శి విట్టల్ అన్నారు. బుధవారం రోజున బోధన్ డివిజన్, బాన్సువాడ నియోజకవర్గం, వర్ని మండల కేంద్రంలో నిర్వహించిన పార్టీ సభ్యత్వ కార్డుల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. తెదేపా కార్యకర్తలకు సభ్యత్వ కార్డులు అందజేస్తూ, పార్టీ ఆవిర్భావ లక్ష్యాలను ప్రజలకు చేరవేయాలని సూచించారు. ఈ సందర్భంగా కార్యకర్తలు విట్టల్ రవికుమార్, రామకృష్ణ, బాలాజీ, శ్రీనివాస్ రావు, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు. ప్రజలతో నేరుగా మమేకం కావాలి, పార్టీ సిద్ధాంతాలను గ్రామస్థాయిలో ప్రచారం చేయాలని విట్టల్ పిలుపునిచ్చారు. ముందున్న ఎన్నికల్లో తెదేపా విజయాన్ని సాధించేందుకు ప్రతి కార్యకర్త తమవంతు పాత్ర పోషించాలని ఆయన పేర్కొన్నారు.

# ఎంఎస్ఎంఇ పార్కుకు శంకుస్థాపన



సీతంపేట : పాలకొండ నియోజకవర్గంలో సీతంపేట మండలం పనుకువలస వద్ద ఎంఎస్ఎంఇ పార్కుకు బుధవారం ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ శంకుస్థాపన చేశారు. మొదటి దశలో 27.26 ఎకరాలను అభివృద్ధి చేస్తారని, ఈ ప్రాజెక్టుకు రూ.11.39 కోట్లు ఖర్చవుతుందని ఎమ్మెల్యే తెలిపారు. పాలకొండ లాంటి గిరిజన నియోజకవర్గంలో ఎంఎస్ఎంఇ పార్కు అందుబాటులోకి వస్తే ఎన్నో గిరిజన కుటుంబాలు అభివృద్ధిలోకి వస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సీతంపేట ఐటిడిఎ ప్రాజెక్టు అధికారి సి.యశ్వంత్ కుమార్ రెడ్డి, మార్కెట్ కమిటి చైర్‌పర్సన్ సంధ్యారాణి, ఎపిఐఐసి జోనల్ మేనేజర్ ఎం.మురళి మోహన్, ఐటిడిపి కోఆర్డినేటర్ హిమరక పవన్, టిడిపి మండల అధ్యక్షులు సవరతోట మొఖలింగం, డైరెక్టర్ కె.అప్పలనాయుడు, సర్పంచ్ విజయ కుమారి తదితరులు పాల్గొన్నారు.





## బోధన్‌లో షీ టీం ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం

బోధన్ పట్టణం, మే 14, సమయం న్యూస్ : బోధన్ పట్టణంలోని ఐ.టి.ఎస్ కంప్యూటర్ శిక్షణ కేంద్రంలో షీ టీం ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి ఐ.టి.ఎస్ కంప్యూటర్స్ శిక్షణ కేంద్ర ప్రతినిధి మహేష్, బోధన్ షీటీం సభ్యులు విజయ్ కుమార్, సునైనా తదితరులు హాజరయ్యారు. కార్యక్రమంలో దాదాపు 60 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా షీ టీం సభ్యులు విద్యార్థులకు 100 ఎమర్జెన్సీ కాల్ నెంబర్, జే.జే చట్టం (జువనైల్ జస్టిస్ యాక్ట్), సైబర్ నేరాలు, డ్రగ్స్ వాడక ప్రమాదాలు, బాల్య వివాహాలపై సమగ్ర అవగాహన కల్పించారు. యువత ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలని, ఏదైనా అత్యవసర పరిస్థితుల్లో 100 నంబర్‌కు ఫోన్ చేయాలని సూచించారు. ఇలాంటి అవగాహన కార్యక్రమాలు విద్యార్థుల్లో చట్టాల పట్ల, సమాజానికి ఎదురవుతున్న సమస్యల పట్ల జ్ఞానం పెంపొందించడంలో కీలకమని వారు వివరించారు.

# తిరుమల భద్రతపై కమిటీ సభ్యుల పరిశీలన



తిరుమల : తిరుమలలో భద్రతపై డీజీపీ హరీష్‌కుమార్ గుప్తా ఆదేశాలతో సెక్యూరిటీ ఆడిటింగ్ కమిటీ సభ్యులు ఐపీఎస్‌లు సునీత్ గరుడ, ఆరిఫ్ హాఫ్జ్‌లు ఎస్పీ హర్షవర్ధన్‌రాజుతో కలిసి బుధవారం సాయంత్రం పరిశీలించారు. వీరు తిరుమల భద్రతకు కీలకమైన అలిపిరి తనిఖీ కేంద్రం, నడకమార్గం, శ్రీవారి పాదాలు, రెండు ఘాట్ రోడ్లతోపాటు తిరుమలో హథీరాంజీ మఠం, శ్రీవారి ఆలయంలో బూందీపోటు, మాడవీధులు, అన్నప్రసాద కేంద్రం, వైకుంఠం క్యూకాంప్లెక్స్ 1, ఔటర్ రింగ్‌రోడ్డు ప్రాంతాల్లో స్వయంగా పరిశీలన జరిపి సెక్యూరిటీ ఆడిటింగ్ నిర్వహించారు. గుర్తించిన అంశాలపై గురువారం పోలీసు, తితిదే విజిలెన్స్, ఆక్టోపస్, అగ్నిమాపక శాఖ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించనున్నారు. తిరుమలలో భక్తుల రక్షణ, భద్రతను మెరుగుపర్చేందుకు ఈ ఆడిటింగ్ చేపట్టినట్లు అధికారులు తెలిపారు. ఈ పరిశీలనలో తిరుమల అదనపు ఎస్పీ రామకృష్ణ, డీఎస్పీ విజయ్‌శేఖర్, తితిదే వీజీవో సురేంద్ర, ఆక్టోపస్, అగ్నిమాపక శాఖ అధికారులు పాల్గొన్నారు.







## త్వరలో రాజాసాబ్ టీజర్

ప్రభాస్, నిధి అగర్వాల్ జంటగా మారుతి దర్శకత్వంలో వస్తున్న సినిమా రాజాసాబ్. . లాస్ట్ ఇయర్ కల్కితో మెప్పించిన డార్లింగ్ చేతిలో ప్రస్తుతం అరడజను సినిమాలున్నాయి. రాజాసాబ్ సినిమాను అప్పుడెప్పుడో సైలెంట్‌గా మొదలు పెట్టి లీక్ పిక్స్, అఫీషియల్ పోస్టర్స్, మోషన్ పోస్టర్‌తో మెల్లిగా హైప్ క్రియేట్ చేశారు. తర్వాత అంతా సైలెంట్ అయ్యింది. ఏప్రిల్ 10న రిలీజ్ పోస్ట్ పోన్ తర్వాత అసలు ఏం జరుగుతుందని కూడా అప్డేట్ లేదు. ఇటీవల ప్రభాస్ ఇటలీ టూర్ తో అంత గప్ చుప్ అయిపోయింది. ఇప్పుడు డార్లింగ్ హైదరాబాద్ లో ల్యాండ్ అయిపోయాడు. దీంతో షూటింగ్ రీస్టార్ట్ అయింది. ప్రస్తుతం బాలీవుడ్ నటుడు సంజయ్ దత్ పై సీన్స్ చిత్రీకరిస్తున్నారు . ఇప్పుడు స్టార్ట్ అయిన ఈ షెడ్యూల్‌లో త్వరలో ప్రభాస్ కూడా పాల్గొనబోతున్నాడు. ఓ వైపు షూటింగ్ చేస్తూనే మరో వైపు టీజర్ రెడీ చేస్తున్నారు. ప్రభాస్ డబ్బింగ్ చెప్పాల్సి ఉంది. త్వరలో టీజర్ రిలీజ్ డేట్ ఉండొచ్చు. రాజాసాబ్ కు థమన్ సంగీతం అందిస్తున్నాడు.

## ఓటీటీలో సినిమా పిచ్చోడు

గత ఏడాది నవంబర్ లో రిలీజైన మూవీ సినిమా పిచ్చోడు. కుమారస్వామి హీరోగా నటించి దర్శకత్వం వహించాడు. పెద్దగా ఆకట్టుకోని స్టోరీ, తక్కువ బడ్జెట్ తో తీసిన చిత్రం కావడంతో థియేటర్లలోకి వచ్చి వెళ్లిన సంగతి కూడా చాలామందికి తెలియదు. ఆరు నెలల తర్వాత ఈ మూవీ అమెజాన్ ప్రైమ్ ఓటీటీలోకి రెంట్ విధానంలో అందుబాటులోకి వచ్చింది. జోష్ అలియాస్ కుమారస్వామి గ్రామంలో పాలు అమ్ముతుంటాడు. కానీ సినిమాలంటే పిచ్చి. అందుకే ఊరిలో వాళ్లని పేరుతో కాకుండా సినిమా పేర్లతో పిలుస్తుంటాడు. ఓసారి భాను.. డెమో ఫిల్మ్ తీసేందుకు జోష్ ఉంటున్న ఊరికి వస్తుంది. ఈ క్రమంలో అనుకోకుండానే జోష్ కి నటించే అవకాశమొస్తుంది. తర్వాత ఏమైందనేదే స్టోరీ.



## బేబీజాన్‌కు మరో ఆఫర్

బాలనటిగా తెరంగేట్రం చేసిన కీర్తి సురేశ్ మహానటి సినిమాతో తెలుగులో ఫేమస్ అయ్యింది. అంతకు ముందు నేను శైలజ సినిమాలోనూ నటించిందీ భామ. కెరీర్ ఆరంభంలో నుంచి మంచి మంచి కథలు ఎంచుకుంటూ ముందుకు సాగుతోందీ అమ్మడు. తన అద్భుతమైన నటనతో తెలుగు ప్రేక్షకులను కట్టిపడేసింది. అలా టాలీవుడ్‌తో పాటు కోలివుడ్ లోను వరుస సినిమాలు తీసిన కీర్తి 'బేబీ జాన్' సినిమాతో బాలీవుడ్‌లోకి ఎంట్రీ ఇచ్చిన విషయం తెలిసిందే. కానీ ఆ చిత్రం డిజాస్టర్ కావడంతో అవకాశాలు తగ్గుతాయని భావించారు. కానీ ఇప్పుడామెకు మంచి ఆఫర్లు వస్తున్నాయి. హిందీలో మరో ప్రాజెక్టు కోసం పలువురు దర్శక నిర్మాతలు ఆమెతో చర్చలు చేస్తున్నట్లు, కొన్ని రోజులుగా నెట్టింట్లో వార్తలు వినపడుతుండగా, ఇప్పుడు మరో ఆసక్తికర విషయం బయటికొచ్చింది.

దేశంలో ప్రస్తుత విద్యా వ్యవస్థ పై రూపొందుతున్న ఓ చిత్రంలో బాలీవుడ్ కథానాయకుడు రాజ్ కుమార్ రావుతో కలిసి కీర్తి నటించనున్నట్లు సమాచారం. ఇంకా టైటిల్ ఖరారు కాని ఈ ప్రాజెక్టును, రాజ్ తన సొంత నిర్మాణ సంస్థ పై తీర్చిదిద్దుతున్నారు. ప్రస్తుతం విద్యను ఒక వ్యాపారంలా మార్చేశారు. ఈ వ్యవస్థలోని కుంభకోణాలను బయట పెట్టే విద్యావేత్తగా కనిపించనుంది కీర్తి.



## అంత రెమ్యూనరేషనా?

బాలీవుడ్ లో దూసుకుపోతున్న నటీమణి దీపికా పదుకొణె. ప్రభాస్, దీపికా కలిసి నటించిన కల్కి 2898 ఏడీ సినిమా పాన్ ఇండియా స్థాయిలో ఘన విజయం సాధించిన విషయం తెలిసిందే. వీరిద్దరి కాంబినేషన్ లో స్పిరిట్ అనే మూవీ రాబోతోందని తెలుస్తోంది. ఈ మూవీ గురించి ఓ రేంజ్‌లో చర్చలు జరుగుతున్నాయి. ముఖ్యంగా సందీప్ రెడ్డి దర్శకత్వం వహించనుండటంతో ఏ రేంజ్‌లో సినిమా ఉండబోతుందా అని అంచనాలు పెరిగిపోతున్నాయి. 'యానిమల్' మూవీ లో సందీప్ డైరెక్షన్ కి వందకి వంద మార్కులు పడ్డాయి. రణ్ బీర్ చూపించిన విధానం కి ప్రేక్షకులు ఫిదా అయ్యారు. అలాంటి ప్రభాస్‌ని ఎలా చూపించబోతున్నాడనే చర్చయితే ఉంది. ప్రస్తుతం ఈ సినిమా ప్రీప్రొ పనులు జరుగుతున్నాయి. ఏ క్షణమైనా ఈ సినిమా పట్టాలెక్కే అవకాశం ఉంది. ఈ మూవీలో హీరోయిన్‌గా మృణాల్ ఠాకూర్, అలియాభట్, రష్మిక మందన్నతో పాటు పలువురు పేర్లు వినిపించినా ఎవరినీ ఖరారు చేయలేదు. తాజాగా దీపికా పదుకొణె పేరు తెరపైకి వచ్చింది. ఈ సినిమా కోసం ఆమె రూ.20కోట్ల భారీ పారితోషికాన్ని డిమాండ్ చేసిందని, మేకర్స్ కూడా అంతమొత్తం ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నారని వార్తలు వస్తున్నాయి. అయితే ఈ విషయంలో అధికారిక ప్రకటన రావాల్సి ఉంది.



## రాజమౌళిని ఆటపట్టించిన రామ్‌చరణ్ ఎన్టీఆర్

**: 'ఆర్ఆర్ఆర్ 2'పై స్పందించిన దర్శకుడు**

హీరోలు రామ్‌చరణ్, ఎన్టీఆర్, డైరెక్టర్ రాజమౌళి ఎంతో స్నేహంగా ఉంటారనే సంగతి తెలిసిందే. వారి అనుబంధాన్ని చాటే ఎన్నో వీడియోలు ఇప్పటికే నెట్టింట సందడి చేయగా.. తాజాగా మరో వీడియో బయటకు వచ్చింది. అందులో.. హీరోలిద్దరూ దర్శకుడిని ఆటపట్టిస్తూ కనిపించారు. 'ఇప్పుడు ఆర్ఆర్ఆర్ 2' చేస్తారా? అని ఒకరు అడగ్గా 'ఎస్' అని రాజమౌళి సమాధానమిచ్చారు. సంబంధిత వీడియో నెట్టింట వైరల్‌గా మారింది. 'ఆర్ఆర్ఆర్ లైవ్ కాన్సర్ట్'లో చోటుచేసుకున్న దృశ్యాలవి. ఆ ఈవెంట్ లండన్‌లోని ప్రఖ్యాత రాయల్ ఆల్బర్ట్ హాల్‌లో కొన్ని రోజుల క్రితం జరిగింది. ఈ ముగ్గురితోపాటు సంగీత దర్శకుడు ఎం.ఎం. కీరవాణి తదితరులు హాజరయ్యారు.



## ఐపీఎల్.. రీ ప్లేస్‌మెంట్‌లు ఉండొచ్చు.. కానీ

ఇటీవల భారత్, పాకిస్థాన్ మధ్య ఉద్రిక్తతలు తలెత్తడంతో ఐపీఎల్ (IPL) 2025ను వాయిదా వేసిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలోనే కొంతమంది విదేశీ ఆటగాళ్లు స్వదేశానికి వెళ్లిపోయారు. ఉద్రిక్తతలు తగ్గడంతో మే 17 నుంచి మిగిలిన మ్యాచ్‌లను నిర్వహించనున్నారు. అయితే, కొంతమంది విదేశీ ప్లేయర్లు తిరిగి భారత్‌కు వచ్చి ఐపీఎల్‌లో పాల్గొనడానికి నిరాకరిస్తున్నారు. కొందరు జాతీయ జట్టు మ్యాచ్‌ల కోసం, మరికొందరు గాయాలు, వ్యక్తిగత కారణాలతో మిగిలిన మ్యాచ్‌లకు అందుబాటులో ఉండటం లేదు. ఈ క్రమంలో ఫ్రాంఛైజీలు ఇబ్బంది పడకుండా ఐపీఎల్ కీలక నిర్ణయం తీసుకుంది. ఆటగాళ్లు అందుబాటులో లేకపోతే వారి స్థానంలో కొత్తవారిని జట్టులోకి తీసుకునేందుకు అనుమతిచ్చింది. అయితే, ఈ రీ ప్లేస్‌మెంట్‌లు తాత్కాలికమేనని, వచ్చే సీజన్‌కు వారిని రిటైన్ చేసుకోవడం కుదరదని




స్పష్టం చేసింది. తాత్కాలికంగా వివిధ జట్లలో చేరే ఆటగాళ్లు 2026 ఐపీఎల్ మినీ వేలంలో తమ పేర్లను నమోదు చేసుకోవాలని సూచించింది. ఈ మేరకు ఐపీఎల్ సీవోవో హేమంగ్ ఫ్రాంఛైజీలకు సమాచారం అందించారు.

* **జేక్ ఫ్రేజర్ దూరం.. దిల్లీ జట్టులోకి బంగ్లా పేసర్**

ఆస్ట్రేలియాకు చెందిన జేక్ ఫ్రేజర్ దిల్లీ క్యాపిటల్స్‌కు ప్రాతినిధ్యం వహిస్తున్న సంగతి తెలిసిందే. అతను వ్యక్తిగత కారణాలతో ఐపీఎల్ 2025 మిగిలిన మ్యాచ్‌లకు అందుబాటులో ఉండటం లేదు. దీంతో దిల్లీ అతడి స్థానంలో బంగ్లాదేశ్ పేసర్ ముస్తాఫిజుర్ రెహ్మాన్ (రూ.6 కోట్లు) జట్టులోకి తీసుకుంది. ముస్తాఫిజుర్ ఇప్పటివరకు ఐపీఎల్‌లో 57 మ్యాచ్‌లు ఆడి 61 వికెట్లు పడగొట్టాడు. ఇక, ఈ సీజన్‌లో 6 మ్యాచ్‌లు ఆడిన ఫ్రేజర్ నిరాశపర్చాడు. 52 బంతులు ఎదుర్కొని 55 పరుగులే చేశాడు.

## నీరజ్ చోప్రాకు లెఫ్టినెంట్ కర్నల్ హోదా

భారత స్టార్ జావెలిన్ త్రోయర్, డబుల్ ఒలింపిక్ పతక విజేత నీరజ్ చోప్రాకు అరుదైన గౌరవం దక్కింది. టెరిటోరియల్ ఆర్మీలో లెఫ్టినెంట్ కర్నల్ గౌరవ హోదాను ప్రదానం చేసినట్లు రక్షణ మంత్రిత్వ శాఖ బుధవారం ప్రకటించింది. ఇది ఏప్రిల్ 16, 2025 నుంచి అమల్లోకి వస్తుందని అధికారిక ప్రకటనలో తెలిపింది. నీరజ్ చోప్రా గతంలో భారత సైన్యంలో సుబేదార్‌గా వ్యవహరించిన సంగతి తెలిసిందే. టోక్యో ఒలింపిక్స్‌లో నీరజ్ స్వర్ణ పతకం సాధించి చరిత్ర సృష్టించాడు. అనంతరం ఇతడిని కేంద్ర ప్రభుత్వం 'పరమ విశిష్ట సేవా పతకం'తో సత్కరించింది. భారత అత్యున్నత క్రీడా పురస్కారమైన మేజర్ ధ్యాన్‌చంద్ ఖేల్‌రత్న పురస్కారాన్ని 2021లో అందుకున్న నీరజ్ చోప్రా.. 2022లో పద్మశ్రీ అవార్డును స్వీకరించాడు. గతేడాది జరిగిన పారిస్ ఒలింపిక్స్‌లో ఈ బల్లెం వీరుడు రజత




పతకం సొంతం చేసుకున్నాడు. నీరజ్ మే 16న దోహా డైమండ్ లీగ్‌లో, జూన్ 24న ఒస్ట్రావా గోల్డెన్ స్పైక్ 2025 అథ్లెటిక్స్ మీట్‌లో పోటీపడనున్నాడు. నీరజ్ కంటే ముందు పలువురు సెలబ్రిటీలు టెరిటోరియల్ ఆర్మీలో లెఫ్టినెంట్ కర్నల్ స్థాయి అధికారులుగా ఉన్నారు. ఈ జాబితాలో స్టార్ నటుడు మోహన్ లాల్, భారత మాజీ కెప్టెన్ ఎంఎస్ ధోనీ, సచిన్ పైలట్, కపిల్ దేవ్, అనురాగ్ ఠాకూర్, అభినవ్ బింద్రా ఉన్నారు.

Printed, Published by Mohammed Murthuza. Printed at Vivek Art Printers APHP SHOP NO.12, OSMANIA UNVERSITY ROAD,HYDERABAD. PUBLISHED ROOM NO.10, Ground Flour, Budha Bhavan, M.G.Road, Secunderabad -03. Ali Publication, Hyderabad. www.samayam.net Mobile No. 98660 19778, 89789 60131.